PRGI NO : TGTEL/26/A2002

EDITOR: PEMBI MAHENDHAR

# నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 67 | పేజీలు : 8 | మంగళవారం 4 ఆగస్టు 2026 | వెల : 4/-




# మళ్లీ తెలంగాణలో ఆ వ్యవస్థ

## సాధ్యాసాధ్యాలపై అధికారుల్లో సందేహాలు

## మళ్లీ 'బ్లాక్ లెవల్' గ్రామీణ పరిపాలన!

- ఎంపీడీవోల ద్వారా అన్ని శాఖల కార్యక్రమాల పురోగతి పర్యవేక్షణకు తాజాగా సీఎం ఆదేశాలు
- టీచర్లు, ఇతర వ్యవస్థలు వారికే రిపోర్ట్ చేసేలా చర్యలు చేపట్టనున్న ప్రభుత్వం
- 1985కు ముందు ఉమ్మడి ఏపీలోనూ బీడీవో వ్యవస్థ ద్వారానే అన్ని పనుల నిర్వహణ
- మెజారిటీ రాష్ట్రాల్లో బ్లాక్ డెవలప్‌మెంట్ వ్యవస్థ ద్వారానే అభివృద్ధి కార్యక్రమాలు.. గతంలో 2,3 మండలాలకు ఇన్‌చార్జీగా బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు




హైదరాబాద్

తెలంగాణలో మళ్లీ గతంలోని 'బ్లాక్ లెవల్'గ్రామీణ పరిపాలనకు రంగం సిద్ధమవుతోందా ? ముఖ్యంగా మండలాల స్థాయిలో అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలపై పర్యవేక్షణ అనేది పాత పద్ధతుల్లో సాగనుందా ? ఈ ప్రశ్నలకు ప్రభుత్వవర్గాల నుంచి అవుననే సమాధానం వస్తోంది. 1985లో మండల వ్యవస్థ - మిగతా3లో

## ప్రధాని వీడియో తొలగింపునకు జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పాలి

- మెటాతో పార్లమెంటరీ ప్యానెల్ చీఫ్
- అభ్యంతరకరమైన ఇతర కంటెంట్‌ను ఆన్‌లైన్‌లో అలాగే ఉంచి ఈ వీడియోపై మాత్రం ఎందుకు చర్యలు తీసుకున్నారు? అని మెటా అధికారులను ప్రశ్న
- "ప్రధాని వీడియోను ఎందుకు తొలగించారు? ఇందుకు ఎవరు అనుమతి ఇచ్చారు?
- క్షమాపణలు చెబితే సరిపోదని బాధ్యత వహించాలని ఎంపీలు చెప్పినట్లు తెలుస్తోంది







## 19 మందితో కర్ణాటక మంత్రివర్గ విస్తరణ

- సీఎం డీకేతో కలిపి 33కు చేరిన మంత్రివర్గ సభ్యులు
- కార్యక్రమానికి హాజరుకాని సిద్ధరామయ్య

## రుణం తీర్చుకునేందుకు పెట్టుబడులతో రండి

- ప్రపంచ దేశాలతో పోటీపడేలా తెలంగాణను అభివృద్ధి చేస్తున్నాం
- పారిశ్రామికంగా, సామాజికంగా చేపట్టే ప్రతి కార్యక్రమంలో మీ వెన్నంటి ఉంటాం
- 'ఆటా' మహాసభలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్

పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు పెట్టుబడులతో రావాలని ఆటా (అమెరికన్ తెలుగు అసోసియేషన్), ఎన్నారైలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. అమెరికాలోని మేరీల్యాండ్ స్టేట్ బాల్టిమోర్‌లో జరిగిన 19వ ఆటా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవాసులనుద్దేశించి ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రవాసుల సమస్యల పరిష్కారానికి చట్టబద్ధ హోదా కలిగిన ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. విదేశాల్లో స్థిరపడిన తెలంగాణ వాసులు రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. వారు సంపాదించిన విజ్ఞానం, అనుభవాన్ని రాష్ట్రాభివృద్ధికి వినియోగించాలని కోరారు. పారిశ్రామికంగా, సామాజికంగా చేపట్టే ప్రతి కార్యక్రమంలో మీ వెన్నంటి - మిగతా3లో





## అయోమయంలో ఆరోగ్యశాఖ

- వైద్య, ఆరోగ్యశాఖలో ఇన్‌చార్జీల రాజ్యం
- కీలక హెచ్ఓడీ పోస్టులు ఖాళీ.. నిర్ణయాల్లో జాప్యం
- టీవీవీపీ కమిషనర్ పదవీ విరమణ చేసి రెండు నెలలు..
- ఆయుష్, నర్సింగ్ రిజిస్ట్రార్‌కు పూర్తిస్థాయి అధిపతులు కరువు



హైదరాబాద్

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ లో పాలనాపరమైన స్తబ్దత నెలకొంది. ప్రజ లకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వ పరంగా భారీగా నిధులు కేటా యిస్తూ కొత్త ఆస్పత్రులు, వైద్య కళాశా లలు, సూపర్ స్పెషాలిటీ సేవలను విస్తరి స్తుంటే.. కీలక విభాగాలకు పూర్తిస్థాయి అధి పతులు లేకపోవడం వల్ల నిర్ణయాల ప్రక్రి య మందగిస్తోంది. - మిగతా3లో



## ఇక్రిశాట్‌కు క్రిస్పర్ కాస్9

- ఉచితంగా దీర్ఘకాలిక లైసెన్స్ ఇచ్చిన అమెరికా సంస్థలు
- సరికొత్త జన్యు సవరణ వంగడాల రూపకల్పనకు మార్గం సుగమం
- స్వల్ప వ్యవధిలోనే క్షేత్రస్థాయికి కొత్త వంగడాలు

## గ్రీన్‌ఫీల్డ్.. రయ్ రయ్

- ఖమ్మం--దేవరపల్లి హైవేపై రాకపోకలకు అనుమతి
- 2017లో డీపీఆర్, రూ.3,573 కోట్లతో నిర్మాణం
- హైదరాబాద్ నుంచి రాజమండ్రి, వైజాగ్‌కు సులభంగా ప్రయాణం
- ఇతర మార్గాలతో పోలిస్తే తగ్గనున్న దూరాభారం




ఖమ్మం

ఖమ్మం--దేవరపల్లి నేష నల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు 165 కి.మీ మేర నిర్మించిన ఈ రహదారి ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు వద్ద మొదలై ఏపీలోని రాజమండ్రి సమీపాన ఉన్న దేవరపల్లి వద్ద ముగుస్తుంది. 2017లో ఈ ప్రాజెక్టుకు రూ.3,573 కోట్లతో కేంద్రం ద్వారా అనుమతులు మంజూరయ్యాయి. ఈ రహ దారి నిర్మాణంతో ఏపీ వెళ్లే వారికి సుమారు 100 కి.మీ. కలిసి రానుంది. చిన్నచిన్న పనులు మినహా నిర్మా ణం పూర్తవడంతో ఇన్నాళ్లు వైరా మండలం సోమవరం నుంచే అనుమతించిన వాహనా లను ఆగస్టు 1నుంచి - మిగతా3లో

నవగీతం
తెలుగు దినపత్రిక

మంగళవారం
4 ఆగస్టు 2026

# ప్రధాని వీడియో తొలగింపునకు జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పాలి






ప్రధాని నరేంద్ర మోదీ అధికారిక ఫేస్?బుక్? పోస్టు తొలగింపు వ్యవహారంపై కమ్యూనికేషన్స్, ఐటీ పార్లమెంటరీ స్థాయీ కమిటీ తీవ్రంగా స్పందించింది. పది రోజుల్లోగా తమ వైఖరిని లిఖితపూర్వకంగా స్పష్టం చేయాలని పార్లమెంటరీ ప్యానెల్ సోమవారం మెటాను కోరింది. దీనిపై మెటా అధిపతి మార్క్ జుకర్‌బర్గ్ వ్యక్తిగతంగా క్షమాపణ చెప్పాలని ప్యానెల్ ఛైర్మన్? నిషికాంత్ దుబే సోమవారం అన్నారు. కాగా, మెటా బాధ్యతను నిర్ధారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు ఇతర సభ్యులు డిమాండ్ చేశారు.

సామాజిక, డిజిటల్ వేదికలు- వాటి నియంత్రణ' అనే అంశంపై చర్చించేందుకు బీజేపీ సభ్యుడు దుబే నేతృత్వంలోని కమిటీ ఈ సమావేశం నిర్వహించింది. ఈ పార్లమెంటరీ ప్యానెల్ సమావేశం మూడు గంటలకు పైగా జరిగింది. కేంద్ర హోం కార్యదర్శి గోవింద్ మోహన్, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (మీవత్) కార్యదర్శి ఎస్. కృష్ణన్, స్నాప్‌చాట్, గూగుల్, ఎక్స్, మెటా (ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్), యూట్యూబ్ వంటి సామాజిక, డిజిటల్ మీడియా వేదికల ప్రతినిధులు కమిటీ ముందు హాజరయ్యారు.

"ప్రధాని వీడియోను ఎందుకు తొలగించారు? ఇందుకు ఎవరు అనుమతి ఇచ్చారు? అభ్యంతరకరమైన ఇతర కంటెంట్‌ను ఆన్‌లైన్‌లో అలాగే ఉంచి ఈ వీడియోపై మాత్రం ఎందుకు చర్యలు తీసుకున్నారు?" అని మెటా అధికారులను ప్రశ్నించారు. ఈ క్రమంలో పొరపాటు జరిగిందని మెటా అధికారులు క్షమాపణలు చెప్పారు. అయితే, క్షమాపణలు చెబితే సరిపోదని బాధ్యత వహించాలని ఎంపీలు చెప్పినట్లు తెలుస్తోంది. వీడియోను తాత్కాలికంగా తొలగించడానికి కారణమైన మెటా అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు డిమాండ్ చేసినట్లు సమాచారం. తమ ప్లాట్‌ఫారమ్‌లలో ఉన్న వివాదాస్పద, అభ్యంతరకరమైన కంటెంట్‌పై కంపెనీ తీసుకున్న చర్యల వివరాలను కూడా మెటాను సభ్యులు కోరినట్లు తెలుస్తోంది. మెటా భారతదేశం నుంచి భారీ ఆదాయాన్ని సంపాదిస్తున్నప్పటికీ, ఈ దేశ చట్టాలను పాటించడం లేదని ఎత్తి చూపారు. సోషల్ మీడియాలో అసమ్మతికి చోటు ఉండటం తప్పనిసరి అని, ప్రభుత్వ వ్యతిరేక కంటెంట్‌ను దేశద్రోహంగా పరిగణించకూడదని ప్యానెల్‌లోని ప్రతిపక్ష ఎంపీలు అన్నట్లు తెలుస్తోంది.

"ఆ వీడియోను ఐదు గంటల పాటు తొలగించినట్లు వారే (మెటా) అంగీకరించారు. రాత్రి 12:30 నుంచి ఉదయం 5:00 గంటల వరకు అది అందుబాటులో లేకుండా పోయింది. ఇది చాలా తీవ్రమైన విషయం. ఇలా మెటా ఒక వీడియోను తొలగించడం ఇది మొదటిసారి కాదు. 2024లో మార్క్ జుకర్‌బర్గ్ పార్లమెంటరీ ఎన్నికల ఫలితాలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. దేశాన్ని అస్థిరపరచడమే వారి మనస్తత్వం. ప్రధానమంత్రి వీడియోను ఐదు గంటల పాటు తొలగించారు. వారు హోం వ్యవహారాలు, ఐటీ మంత్రిత్వ శాఖల ఆదేశాలను వినరు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియోను తొలగించినందుకు మార్క్ జుకర్‌బర్గ్ వ్యక్తిగతంగా క్షమాపణ చెప్పాలి. ఒకవేళ జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పకపోతే, సెక్షన్ 79 కింద వారికి ఉన్న సేఫ్ హార్బర్ రక్షణను వెనక్కి తీసుకోవాలి." అని దుబే అన్నారు. సమాచార సాంకేతిక చట్టంలోని ఈ నిబంధన ప్రకారం, సోషల్ మీడియా నెట్‌వర్క్‌లు, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు తమ ప్లాట్‌ఫారమ్‌లోని థర్డ్-పార్టీ కంటెంట్‌కు చట్టపరంగా బాధ్యత వహించరు.

**ఇంతకీ ఏం జరిగింది?**

నీట్?- యూజీ 2026 పరీక్షల అక్రమాలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతృత్వంలో విద్యార్థులు ఢిల్లీలోని జంతర్ మంతర్? వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలోనే జులై 23న ప్రధాని మోదీ మొదటిసారిగా నేరుగా యువతను ఉద్దేశించి ఫేస్?బుక్? వేదికగా మాట్లాడారు. అందులో పరీక్ష పేపర్ లీకేజీలకు పాల్పడే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఇందుకోసం మరింత కఠినమైన చట్టపరమైన నిబంధనలను కేంద్ర మంత్రివర్గం ముందుకు తీసుకువస్తామని తెలిపారు. అయితే ఫేస్?బుక్? జులై 28 తెల్లవారుజామున ఈ వీడియో యాక్సెస్?ను కొద్దిసేపు నిలిపివేసింది. ఫలితంగా మోదీ పెట్టిన వీడియో పోస్టు కనిపించకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వం ఈ చర్యను తీవ్రంగా పరిగణించింది. ప్రధాని మోదీ పోస్టు ఎందుకు తొలగించారో చెప్పాలంటూ, మెటా గ్లోబల్ పబ్లిక్? పాలసీ హెడ్?కు ఐటీ మంత్రిత్వశాఖ సమన్లు జారీ చేసింది. దీంతో దిగి వచ్చిన మెటా కేంద్ర ప్రభుత్వానికి క్షమాపణ చెప్పింది. "ప్రధాని నరేంద్ర మోదీ వీడియోను పొరపాటున తొలగించడం జరిగింది. ప్రస్తుతం దీనిని తిరిగి పునరుద్ధరించాం" అని మెటా ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు.

# బీజేపీ కంచుకోట కూలడానికి కారణాలివే



బిహార్ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. గత 3 దశాబ్దాలుగా (1995 నుంచి) భారతీయ జనతా పార్టీకి తిరుగులేని కంచుకోటగా ఉన్న పట్నాలోని బాంకీపుర్ అసెంబ్లీ నియోజకవర్గం చేజారిపోయింది. ఇటీవల జరిగిన ఉపఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ భారీ విజయం సాధించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఖాళీ చేసిన ఈ స్థానంలో బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాను ఓడించి పీకే తొలిసారిగా బిహార్ శాసనసభలో అడుగుపెడుతున్నారు. వాస్తవానికి బాంకీపుర్ బీజేపీకి సేఫెస్ట్ సీట్‌గా గుర్తింపు పొందింది. నితిన్ నబీన్ తండ్రి కిశోర్ ప్రసాద్ సిన్హా 1995 నుంచి ఈ ప్రాంతంలో పార్టీకి పునాది వేయగా, ఆయన మరణం తర్వాత 2006 నుంచి నితిన్ నబీన్ వరుసగా ఐదుసార్లు గెలిచారు. 2026లో ఆయన రాజ్యసభకు వెళ్లడంతో ఈ ఉపఎన్నిక వచ్చింది. అంతటి బలమైన స్థానంలో బీజేపీ ఓడిపోవడం ఆ పార్టీకి రాష్ట్రంలో రాజకీయంగా పెద్ద దెబ్బగా విశ్లేషకులు భావిస్తున్నారు.

**ప్రశాంత్ కిశోర్ సంచలన విజయానికి కారణాలివే**

పీకే స్వయంగా బరిలోకి దిగడం- 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీ 238 సీట్లలో పోటీ చేసినా ఒక్కటి కూడా గెలవలేకపోయింది. అప్పట్లో పీకే పోటీ చేయలేదు. కానీ ఈసారి వేరొకరిని నిలబెట్టకుండా, బీజేపీకి తిరుగులేని బాంకీపుర్ స్థానంలో తానే స్వయంగా బరిలోకి దిగడం ప్రజల్లో పెద్ద చర్చకు దారితీసింది. బీజేపీ నిలబెట్టిన నీరజ్ సిన్హా కంటే పీకే అభ్యర్థిత్వమే బలంగా కనిపించింది. రాజకీయ వ్యూహకర్తగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన వ్యక్తిగత ఇమేజ్ ఆయన గెలుపునకు కారణమైంది.

**మార్పు కోరుకున్న జనం**

ఈ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుకున్న భావన స్పష్టంగా కనిపించిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. బాంకీపుర్‌ను బీజేపీ కోటగా పేర్కొనడాన్ని పీకే ప్రచారంలో ప్రధాన అంశంగా వాడుకున్నారు. 'కోటను రాజకీయ పార్టీలు కాదు, ప్రజలే నిర్మిస్తారు.' అంటూ ఆయన చేసిన ప్రచారం ఓటర్లను ఆకట్టుకుంది. ఇది బీజేపీ వైఖరిపై ప్రజల్లో కొంత వ్యతిరేకత వ్యక్తమయ్యేలా చేసింది. ఇదే సమయంలో ఈ ఉప ఎన్నికను ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి పాలనపై ప్రజాభిప్రాయ సేకరణగా ప్రశాంత్ కిశోర్ మలిచారు.

**కుల సమీకరణాల్లో మార్పు**

బైపోల్‌లో కుల సమీకరణాలు తలకిందులయ్యాయి. సాధారణంగా అగ్రవర్ణ ఓటర్లు బీజేపీకి అండగా ఉంటారు. కీలక కాయస్థ సామాజికవర్గం బీజేపీకి ఓటేసినప్పటికీ, బ్రాహ్మణ (ప్రశాంత్ కిశోర్ బ్రాహ్మణ సామాజికవర్గం), ఇతర అగ్రవర్ణాల ఓట్లు ్రాఖ వైపు మొగ్గినట్లు తెలుస్తోంది. ఆర్జేడీ సాంప్రదాయ ముస్లిం- యాదవ్ ఓటు బ్యాంకు కూడా ఈసారి ప్రశాంత్ కిశోర్ వైపు మళ్లింది. బీజేపీని ఓడించగల సామర్థ్యం ఆయనకు ఉందని భావించి వ్యూహాత్మకంగా ఓటేశారు. ఇతర వెనుకబడిన వర్గాలు, దళిత ఓటర్లు కూడా మార్పు కోసం ప్రశాంత్ కిశోర్ వైపు నిలిచారు. విద్య, ఉద్యోగాలే ప్రచార ఆయుధం- ఇక్కడ ప్రశాంత్ కిశోర్- కులం, మతం, భావోద్వేగాల కంటే విద్య, నిరుద్యోగం, శాంతి భద్రతలు, అవినీతి నిర్మూలన, స్థానిక సమస్యల చుట్టే దృష్టి సారించారు. బీజేపీ మాత్రం నితిన్ నబీన్ పేరునే ప్రచారంలో ప్రధానంగా ఉపయోగించగా, ప్రశాంత్ కిశోర్ భవిష్యత్ పాలన, అభివృద్ధి అంశాలపై దృష్టి పెట్టారు.

నిశ్శబ్ద ప్రచారం, మొహల్లా సమావేశాలు- మిగతా పార్టీల్లా పెద్ద బహిరంగ సభల కంటే పీకే మొహల్లా సమావేశాలు (చిన్న చిన్న వీధుల్లో సమావేశాలు), పాదయాత్రల ద్వారా నేరుగా ప్రజలతో మమేకమయ్యారు. లోకల్ బీజేపీలో ఉన్న అంతర్గత విభేదాల్ని, స్థానికంగా అసంతృప్తిని తన వ్యూహాలతో అనుకూలంగా మార్చుకున్నారు.

నీట్ పేపర్ లీక్, విద్యార్థుల నిరసనలు- దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ ఉదంతాలు, దానికి నిరసనగా జెన్- జీ విద్యార్థుల ఆందోళనలు కూడా ఈ ఎన్నికపై స్పష్టమైన ప్రభావం చూపినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వరకు వెళ్లిన ఈ వ్యవహారంతో ఆగ్రహంతో ఉన్న యువత, విద్యార్థులు బీజేపీకి వ్యతిరేకంగా ఓటేసినట్లు పేర్కొంటున్నారు. నీట్ నిరసనల తర్వాత జరిగిన తొలి ఎన్నిక ఇదే కావడంతో ఈ ప్రభావం పడిందని భావిస్తున్నారు.

ముందస్తు ప్రచారం, బూత్ స్థాయి వ్యూహం- బీజేపీ, ఆర్జేడీ ప్రచారం ప్రారంభించడానికి 2 నెలల ముందుగానే పీకే క్షేత్రస్థాయిలో ప్రచారం మొదలుపెట్టారు. ప్రచారం ఆఖరి రోజుల్లో బీజేపీ 40 మంది స్టార్ క్యాంపెయినర్లను దించినప్పటికీ, అప్పటికే పీకే గ్రాస్ రూట్ లెవెల్‌లో వేసిన పునాదిని కదిలించలేకపోయారు.

**జన్ సురాజ్ పార్టీకి తొలి అసెంబ్లీ విజయం**

2025 ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీ ఒక్క సీటు కూడా గెలవకపోయినా, రాష్ట్ర వ్యాప్తంగా 3.4 శాతం ఓట్లు సాధించింది. కులమతాల పరంగా బలమైన ఓటు బ్యాంక్ లేకుండా పోటీ చేసిన కొత్త పార్టీకి అది చిన్న విజయంగా పరిగణించారు. ప్రభుత్వ ఉద్యోగులు, సాయుధ దళాలకు చెందిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో కూడా పార్టీకి మంచి మద్దతు లభించినట్లు అప్పుడే సంకేతాలు కనిపించాయి. ఇప్పుడు బాంకీపుర్ ఉపఎన్నికలో తొలి అసెంబ్లీ సీటును గెలుచుకోవడం ద్వారా జన్ సురాజ్ పార్టీ రాజకీయంగా కొత్త దశలోకి అడుగుపెట్టిందని భావిస్తున్నారు. రాష్ట్రంలో బీజేపీ-జేడీయూ, ఆర్జేడీ ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా జన్ సురాజ్ ఎదుగుతుందా అన్న చర్చ మొదలైంది.

**బీజేపీకి హెచ్చరిక- కొత్త శకానికి నాంది**


బాంకీపుర్ ఫలితం బీజేపీకి కేవలం ఒక ఉపఎన్నిక ఓటమి మాత్రమే కాదు. బీజేపీ జాతీయ అధ్యక్షుడి సొంత నియోజకవర్గాన్ని కోల్పోవడం, సామ్రాట్ చౌదరీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన తొలి ప్రధాన ఎన్నికలో పరాజయం ఎదురుకావడం పార్టీకి కోలుకోలేని దెబ్బగా భావిస్తున్నారు. అగ్రవర్ణ ఓటు బ్యాంక్ శాశ్వతంగా తమకే చెందుతుందనే భావనకు ఈ ఫలితం హెచ్చరికగా నిలిచిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వ్యూహకర్తగా కాకుండా ప్రత్యక్ష రాజకీయ నాయకుడిగా ప్రశాంత్ కిశోర్ సాధించిన ఈ విజయం, రాబోయే రోజుల్లో బిహార్‌లో త్రిముఖ పోరుకు లేదా కొత్త రాజకీయ సమీకరణాలకు దారితీస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని చెబుతున్నారు.

**పోల్ స్ట్రాటజిస్ట్ నుంచి ఎమ్మెల్యే వరకు ప్రశాంత్ కిశోర్ ప్రస్థానం**

ఇక ఎన్నికల వ్యూహకర్తగా దేశవ్యాప్తంగా ఎన్నో పార్టీల్ని విజయతీరాలకు చేర్చిన ప్రశాంత్ కిశోర్ ఇప్పుడు స్వయంగా ప్రజల తీర్పుతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. తన జన్ సురాజ్ పార్టీకి తొలి విజయాన్ని అందించడమే కాకుండా, తన వ్యక్తిగత రాజకీయ ప్రయాణంలోనూ కీలక మైలురాయిని చేరుకున్నారు. గతంలో ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ (బెంగాల్), అరవింద్ కేజ్రీవాల్ (ఢిల్లీ), నితీశ్ కుమార్ (బిహార్), వైఎస్ జగన్మోహన్ రెడ్డి (ఆంధ్రప్రదేశ్), ఉద్ధవ్ ఠాక్రే (మహారాష్ట్ర), ప్రస్తుత తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ వంటి నేతల ఎన్నికల విజయాల్లో కీలక పాత్ర పోషించారు.

ఎన్నికల వ్యూహకర్తగా సాధించిన విజయాలతో పీకేను 2015లో బిహార్ సీఎంగా ఉన్న నితీశ్ కుమార్ తన సలహాదారుగా నియమించుకున్నారు. తర్వాత 2018లో జేడీయూలో చేరిన ఆయన జాతీయ ఉపాధ్యక్షుడి బాధ్యతలు చేపట్టారు. నితీశ్ ఆ సమయంలో తన రాజకీయ వారసుడిగా పీకేను తయారు చేస్తున్నారన్న ప్రచారం కూడా జరిగింది. అయితే పౌరసత్వ సవరణ చట్టంపై (జూూూ) నితీశ్ వైఖరిని బహిరంగంగా విమర్శించిన తర్వాత ఆయన్ను పార్టీ నుంచి తొలగించారు. 2021లో బెంగాల్ ఎన్నికల్లో మమతా బెనర్జీ విజయం కోసం వ్యూహాలు రచించి విజయవంతమయ్యారు. తర్వాత కాంగ్రెస్ పార్టీని పునర్నిర్మించేందుకు పీకే ఒక ప్రణాళికను పార్టీ అధిష్ఠానానికి సమర్పించారు. అయితే ఆ చర్చలు ఫలించలేదు. దీంతో ప్రశాంత్ కిశోర్ తర్వాత పూర్తిగా బిహార్ రాజకీయాలపై దృష్టి సారించి జన్ సురాజ్ పార్టీని స్థాపించారు. తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించారు. తనే గెలిచారు. బీజేపీని కోలుకోలేని దెబ్బతీశారు.

## ఇక్రిశాట్‌కు క్రిస్పర్ కాస్9 సాంకేతికత!



ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని చిన్న, సన్నకారు రైతుల ఆహార భద్రత, వాతావరణ మార్పులను తట్టుకునే సరికొత్త జన్యు సవరణ వంగడాల రూపకల్పన దిశగా హైదరాబాద్‌లోని అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధనా సంస్థ (ఇక్రిశాట్) ఒక చరిత్రాత్మక మైలురాయిని సాధించింది. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన జన్యు సవరణ (జీన్ ఎడిటింగ్) పరిజ్ఞానమైన 'క్రిస్పర్ కాస్9'ను సుదీర్ఘకాలం పాటు ఉపయోగించుకునేందుకు అమెరికా కంపెనీల నుంచి ఇక్రిశాట్ తాజాగా హక్కులు పొందింది. క్రిస్పర్ కాస్9 సాంకేతికతపై ప్రధాన పేటెంట్లు అమెరికా సంస్థలకు ఉన్నాయి. మన దేశంలో శాస్త్రవేత్తలు పరిశోధనల స్థాయిలో ప్రయోగశాలల్లో దీన్ని ఉపయోగిస్తున్నప్పటికీ, దాని ఆధారంగా రూపొందించిన జన్యుమార్పిడి విత్తనాలను వాణిజ్యపరంగా రైతుల వద్దకు తీసుకెళ్లటానికి అత్యధిక లైసెన్సింగ్ రుసుం చెల్లించాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో క్రిస్పర్ కాస్9 జన్యుసవరణ సాంకేతికత సొంతదారులైన అమెరికా సంస్థలు కోర్టేవా అగ్రిసైన్స్, బ్రాడ్ ఇన్‌స్టిట్యూట్‌లు మానవతా దృక్పథంతో ఇక్రిశాట్‌కు ఉచితంగా దీర్ఘకాలిక లైసెన్స్ ఇవ్వటం విశేషం. తద్వారా ఎలాంటి పేటెంట్ వివాదాలు లేకుండా, అతి తక్కువ ఖర్చుతో ఇక్రిశాట్ పరిశోధనలు పూర్తి చేసేందుకు, లైసెన్సింగ్ రుసుము నుంచి మినహాయింపు పొందేందుకు అవకాశం ఏర్పడింది. ఇదో మైలురాయి: ఇక్రిశాట్ డీజీ: ఈ ఒప్పందం ద్వారా అభివృద్ధి చేసే పంటల విత్తనాలపై పేటెంట్ భారం ఉండదు కా బట్టి, ఆసియా, ఆఫ్రికాలోని పేద రైతులకు వాతావరణ మార్పు ల వల్ల సంభవించే అనావృష్టి, తీవ్రమైన కరువు, కొత్త రకం తెగుళ్లను తట్టుకునే కంది, శనగ, వేరుశనగ, జొన్న, సజ్జ, ఇతర చిరుధాన్యాలకు సంబంధించి సరికొత్త జన్యుసవరణ విత్తనాలు అతి తక్కువ ధరలోనే అందుబాటులోకి వస్తాయి. 'ఈ ఒప్పందం ఇక్రిశాట్‌కు, మెట్ట వ్యవసాయంపై ఆధారపడిన లక్షలాది మంది చిన్న రైతులకు, వారి కుటుంబాలకు ఒక పరివర్తనాత్మక మానవతా మైలురాయి' అని ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాంశు పాఠక్ సోమవారం ఒక ప్రకటనలో అభివర్ణించారు. కాగా సాధారణ సాంప్రదాయ పద్ధతిలో వాతావరణ మార్పుల ను తట్టుకునే కొత్త పంట రకాన్ని తయారు చేయటానికి 10--15 ఏళ్లు పడుతుందని, ఈ ఒప్పందం ద్వారా క్రిస్పర్ కాస్9ను నేరుగా వాడటం వల్ల 3--5 సంవత్సరాల్లోనే కొత్త వంగడాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## 19 మందితో కర్ణాటక మంత్రివర్గ విస్తరణ




బెంగళూరు: కర్ణాటకలో ఆశావహులు ఎంతో ఆశతో ఎదురు చూసిన మంత్రివర్గ విస్తరణ ఎట్టకేలకు జరిగింది. బెంగళూరు లోక్‌భవన్‌లో సోమవారం సాయంత్రం 19 మంది కొత్త మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ వారిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. జూన్ 3వ తేదీన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఎప్పటికప్పుడు మంత్రివర్గ విస్తరణ పెండింగ్‌లో పడుతూ వచ్చింది. అయితే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ అందడంతో కేబినెట్ విస్తరణకు మార్గం సుగమం అయింది. జూన్ 3న ముఖ్యమంత్రిగా డీకే ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు అదే రోజు మొత్తం 13 మంది నూతన మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. తాజా విస్తరణతో ముఖ్యమంత్రితో సహా మొత్తం మంత్రివర్గ సభ్యుల సంఖ్య 33కు చేరింది. సిద్ధరామయ్య మంత్రివర్గ సభ్యుల సంఖ్య 34 కావడం గమనార్హం. కాగా సిద్ధరామయ్య మంత్రివర్గంలో ఉన్న దాదాపు 19 మంది డీకే మంత్రివర్గంలో స్థానం సంపాదించుకోవడం గమనార్హం. సీనియారిటీ, పలుకుబడికి జాబితాలో ప్రాధాన్యత లభించినట్లు స్పష్టమవుతోంది. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్, కేపీసీసీ అధ్యక్షుడు బీకే హరిప్రసాద్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సుర్జేవాలా తదితరులు పాల్గొన్నారు. తాజా మాజీ సీఎం సిద్ధరామయ్య, బీజేపీ, జేడీఎస్ నేతలు గైర్హాజరయ్యారు.

**చివరి క్షణంలోనూ మార్పులు.. చేర్పులు**

తాజామంత్రివర్గ విస్తరణ జాబితాలో తొలుత ఒక మహిళ పేరు ఉన్నప్పటికీ.. అటు తర్వాత వేరొకరితో ఆ స్థానాన్ని భర్తీ చేయడం గమనార్హం. దీనితో డీకే మంత్రివర్గంలో మహిళలకు ప్రాతినిధ్యం దక్కని పరిస్థితి నెలకొంది. చివరి మూడు గంటల్లోనే మూడు సార్లు మంత్రులు, స్పీకర్ అభ్యర్థుల జాబితా మారడం గమనార్హం. తొలి జాబితాలో చోటు దక్కించుకున్న ఎమ్మెల్సీ గాయత్రీ శాంతేగౌడను చివరి నిమిషంలో తప్పించి తాజా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బోసురాజుకు అవకాశం ఇచ్చారు. అలాగే తొలి జాబితాలో మహంకాళు వైద్య పేరు ఉంటే, దీనిని తొలగించి తాజా మాజీ మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున్‌తో భర్తీ చేశారు. తమకు తాజా విస్తరణలో చోటు లభించకపోవడంతో పలువురు సీనియర్లు, ఆశావహులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. కొందరు ఏకంగా శాసన సభ్యత్వానికే రాజీనామా సమరి?పస్తామని బెదిరించే వరకూ పరిస్థితి వెళ్లింది. అయితే అసమ్మతిని సహించబోమని అధిష్టానం స్పష్టం చేసింది.

**కొత్తగా మంత్రివర్గంలో చేరిన 19 మంది మంత్రులు..**

1. డాక్టర్ అజయ్‌సింగ్, 2. హెచ్‌సీ బాలకృష్ణ, 3. కేఎస్ బసవంతప్ప, 4. బసవ రాజరాయరెడ్డి, 5. ఎన్.చలువరాయస్వామి, 6. లక్ష్మణ సవది, 7. సొరెకొప్ప మధు బంగారప్ప, 8. ఎస్ఎస్.మల్లికార్జున్, 9. బి.నాగేంద్ర, 10. నరేంద్ర స్వామి, 11. పుట్టరంగశెట్టి, 12. టి.రఘుమూర్తి, 13. రిజ్వాన్ అర్షద్, 14. రుద్రప్ప లమాణి, 15. సంతోష్ ఎస్.లాడ్, 16. కేఎం శివలింగేగౌడ, 17. శివరాజ్ తంగడగి, 18. విజయానంద కాశప్పనవర్, 19. జమీర్ అహ్మద్‌ఖాన్

## సుప్రీంకోర్టులో జడ్జిల సంఖ్య పెంపు బిల్లుకు లోక్‌సభ ఆమోదం

దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచే కీలక బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉన్న మొత్తం 34 మంది న్యాయమూర్తుల సంఖ్యను 38కు పెంచే ఉద్దేశంతో తీసుకొచ్చిన సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు-2026ను విపక్షాల తీవ్ర నిరసనల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. దీంతో ఈ ఏడాది మే నెలలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించే ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. లోక్‌సభ సమావేశం ప్రారంభమైనప్పటి నుంచే ప్రతిపక్ష సభ్యులు నినాదాలతో సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు.

# అయోమయంలో ఆరోగ్యశాఖ

-మొదటిపేజీ తరువాయి

శాఖలోని అత్యంత కీల కమైన హెచ్ఓడీ పోస్టుల్లో చాలావరకు ఇన్‌చార్జి అధికారులే బాధ్యతలు నిర్వహిస్తుండటంతో పాలనలో స్పష్టమైన లోటు కనిపి స్తోంది. ఇన్‌చార్జీలుగా పనిచేస్తున్న అధికారు లు తమ అసలు బాధ్యతలతోపాటు అద నపు బాధ్యతలు నిర్వహించాల్సి రావడం, కీలక విధాన నిర్ణయాలు తీసుకోవడంలో సంకోచించడం, ఫైళ్ల పరిష్కారం లో జాప్యం వంటి సమస్యలు శాఖ పనితీరుపై ప్రభావం చూపుతున్నాయని అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల నిర్వహణకు కీలకమైన తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) కమిషనర్ పదవి ఖాళీ అయి రెండు నెలలు దాటింది. టీవీవీపీ కమిషనర్‌గా డాక్టర్ అజయ్‌కుమార్ మే 31న పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి వైద్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూనే ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. పాలన పరమైన విధుల్లో బిజీగా ఉండే ప్రభుత్వ కార్యదర్శి.. అదనపు బాధ్యత అయిన టీవీవీ పీపై పూర్తిస్థాయి దృష్టి కేంద్రీకరించలేక పో తున్నారు.
దీన్ని అలుసుగా తీసుకొని టీవీ వీపీ పరిధిలోని ఆసుపత్రుల్లో వైద్య సేవలు మందగించాయనే ఆరోపణలు న్నా యి. వర్షాకాలంలో పల్లెలు, గిరిజన ప్రాంతాల్లో రోగాలు విజృంభించే అవకాశం ఉన్న పరిస్థి తుల్లో ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ఇతర అధికారులతో మానిటరింగ్ చేయా ల్సిన టీవీవీపీ కమిషనర్ లేకపోవడం లోటు గా మారింది. టీవీవీపీ కమిషనర్ నియా మకం కోసం అర్హుల జాబితాను తయారు చేసి ఫైల్‌ను సీఎంకు పంపించగా, రెండు నెలలు దాటినా నిర్ణయం తీసుకోలేదు.
తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్‌గా విద్యావతి పదవీ విరమణ చేసి సంవత్సరం గడుస్తున్నా రెగ్యులర్ నియామకం జరగ లేదు. డిప్యూటీ డైరెక్టర్ విద్యుల్లత ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. నర్సింగ్ కళా శాలలకు అనుమతులు, నమోదు ప్రక్రియ, నర్సుల రిజి స్ట్రేషన్, తనిఖీలు వంటి కీలక బాధ్యతలు ఈ కౌన్సిల్ పరిధిలో ఉంటాయి. పూర్తిస్థాయి అధిపతి లేకపోవడంతో అనేక పరిపాలనా నిర్ణయాలు పెండింగ్‌లో ఉన్న ట్లు తెలుస్తోంది. ఇన్ చార్జిగా వ్యవహరిస్తున్న విద్యుల్లత ఏకంగా మూడు పోస్టులను నిర్వ హిస్తూ, కొత్త నియా మకానికి సహకరించడం లేదనే ఆరోపణలున్నాయి.

**ఆయుష్ శాఖలోనూ అంతే...**

ఆయుర్వేదం, యోగా, యునానీ, సిద్ధ, హోమియోపతి సేవల విస్తరణకు బాధ్యత వహించే ఆయుష్ శాఖలో కూడా పూర్తి స్థాయి డైరెక్టర్ లేకుండా ఇన్‌చార్జి వ్యవస్థనే సాగిస్తున్నారు. ఇన్‌చార్జి డైరెక్టర్‌గా శ్రీకాంత్‌బాబు ఉన్నారు. తాజాగా మంగళవారం ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డైరెక్టర్‌గా నాన్ కేడర్ అధికారి కె. విద్యాసాగర్‌ను నియమించారు. గత కొంతకాలంగా ఈ పదవి కూడా ఇన్‌చార్జి పాలనలోనే ఉంది.

**ప్రజారోగ్యంలో 12 ఏళ్లుగా..**

రాష్ట్ర ప్రజారోగ్య వ్యవస్థకు ప్రధాన కేంద్రంగా భావించే డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్) కార్యాలయంలో 12 ఏళ్లుగా పూర్తిస్థాయి డైరెక్టర్ నియామకం జరగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పోస్టును రెగ్యులర్ పోస్టుగా పునరుద్ధరించినప్పటికీ ఇప్పటివరకు నియామకం చేపట్టలేదు. అలాగే డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పోస్టు భర్తీకి అవసరమైన డిపార్ట్‌మెంటల్ ప్రమో షన్ కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉన్నా నెలల తరబడి అది జరగడం లేదు. సీనియర్ అధికారుల పదోన్నతులు, పోస్టింగ్‌లు నిలిచిపోవడంతో దిగువస్థాయి పాల నపై కూడా ప్రభావం పడుతోంది.

# అవయవ దానంపై అవగాహన

## కిమ్స్ ఆధ్వర్యంలో 'అంగదాన్ జీవన్ సంజీవని అభియాన్' కార్యక్రమం

అవయవ దానం చేయడం ద్వారా ఒక వ్యక్తి మరణానంతరం కూడా పలువురికి జీవం ప్రసాదించగలమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సమాజంలో అవయవ దానంపై ఉన్న అపోహ లను తొలగించేందుకు విస్తృత అవగాహన అవసరమని చెప్పారు. జాతీయ స్థాయి అవయవ దాన అవగాహన కార్యక్రమం 'అంగదాన్ జీవన్ సంజీవని అభియాన్?'లో భాగంగా కిమ్స్? కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఛైర్మన్ అండ్? మేనేజింగ్ డైరెక్టర్ డా. బి. భాస్కరరావు పాల్గొన్నారు. కిమ్స్ హాస్పిటల్స్, నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్), కిమ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్స్ సికింద్రాబాద్?లో ఈ కార్యక్రమం జరిగింది. "అవయవ దానం -- ప్రాణదానం చేయండి, మానవత్వపు వారసత్వాన్ని నిలబెట్టండి" అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

**మానవతా సేవలో అత్యున్నతమైన కార్యం**

అవయవ దానం అనేది మానవతా సేవలో అత్యున్నతమైన కార్యమని కిమ్స్ మెడికల్ ఎడ్యూకేషన్ (అకాడెమిక్స్) డైరెక్టర్ డా. ఎస్. మణిమాల రావు పేర్కొన్నారు. సమాజంలో ప్రతి కుటుంబం ఈ విషయంపై చర్చించాల్సిన అవసరం ఉందని అన్నారు. మరణానంతరం అవయవ దానం చేయాలనే సంకల్పం ఎన్నో కుటుంబాలకు కొత్త ఆశను ఇస్తుందని చెప్పారు.

**ఎనిమిది మందికి ప్రాణదానం**

గుండె, ఊపిరితిత్తుల మార్పిడి నిపుణుడు డా. సందీప్ అట్టావర్ మాట్లాడుతూ బ్రెయిన్ డెత్ అనంతరం జరిగే అవయవ దానం ద్వారా గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు వంటి కీలక అవయవాలను అవసరమైన రోగులకు మార్పిడి చేసి ప్రాణాలు కాపాడవచ్చని వివరించారు. ఒక అవయవ దాత ఎనిమిది మందికి ప్రాణదానం చేయడంతో పాటు 50 మందికి పైగా జీవన



నాణ్యతను మెరుగుపరచగలడని స్పష్టం చేశారు.

**విద్యాసంస్థలు ముందుకు రావాలి**

ఇప్పుడిప్పుడే ప్రజల్లో అవయవాల మార్పిడిపై అవగాహ వస్తోందని కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ డాక్టర్. సహారియా, డాక్టర్. ఉమ మహేశ్వరరావులు అన్నారు. వీటిపై ఇంకా మరింతగా అవగాహన రావాలని చెప్పారు. అవయవాల మార్పిడితో జీవన నాణ్యత పెరుగుతుందన్నారు. యువతలో అవయవ దానంపై సానుకూల దృక్పథం పెంపొందించేందుకు విద్యాసంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**కుటుంబ సభ్యులకు సత్కారం**

కిమ్స్ హాస్పిటల్స్ సికింద్రాబాద్ సీఓఓ డా. సౌరబ్ లాల్ మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థులు సమాజంలో అవయవ దాన సందేశాన్ని తీసుకెళ్లే రాయబారులుగా పనిచేయాలని సూచించారు. ఆర్గాన్ డోనేషన్, కెడవార్ ట్రాన్స్ ప్లాంట్ సర్వీస్ ప్రెసిడెంట్ కె. మంగాదేవి ఆధ్వర్యంలో అవయవదానం చేసిన వారికి, ఆయా కుటుంబ సభ్యులకు సత్కారం చేశారు.

**వైద్య ప్రక్రియలపై నిపుణులు అవగాహన**


ఈ కార్యక్రమంలో అవయవ దాన ప్రాముఖ్యత, దాత నమోదు విధానం, బ్రెయిన్ డెత్ అనంతరం అనుసరించే వైద్య ప్రక్రియలపై నిపుణులు అవగాహన కల్పించారు. విద్యార్థులు అవయవ దాన ప్రతిజ్ఞ చేసి అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు డా. హారిణి చెబ్రోలు, అధ్యపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. చివరగా నిర్వాహకులు మాట్లాడుతూ "అవయవ దానం మహాదానం, ఒక నిర్ణయం ఎన్నో ప్రాణాలను కాపాడగలదు" అనే సందేశాన్ని ప్రతి కుటుంబానికి చేరవేయాలని కోరారు.

# హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం

ఉదయం నుంచి ఉక్కపోతగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. సాయంత్రం హైదరాబాద్ నగరంలో పలుచోట్ల కురుస్తున్న వర్షం కురిసింది. నగరంలోని జూబ్లీహిల్స్, పంజాగుట్ట, సనత్ నగర్, ఫిలింనగర్, ఎర్రగడ్డ, అమీర్?పేట్?, రహమత్ నగర్ పరిసరాల ప్రాంతాల్లో వర్షం మొదలైంది.
కుత్బుల్లాపూర్, బాలానగర్, గండి మైసమ్మ, కొంపల్లి, కూకట్‌పల్లి, మూసాపేట్, కేపీహెచ్‌బీ, నిజాంపేట్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఐటీ కారిడార్‌లోని రాయదుర్గం, మాదాపూర్ ప్రాంతాల్లో వాన కురిసింది. నగరంలోని చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా, ఫలక్‌నుమా, ఉప్పుగూడ ప్రాంతాల్లో వర్షం కురిసింది. వర్షం కారణంగా పలుచోట్ల ట్రాఫిక్ నెమ్మదించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అప్రమత్తంగా ఉండాలని వాహనదారులకు సూచిస్తున్నారు.

**నెమ్మదిగా కదులుతున్న వాహనాలు**

కాగా ఐటీ కారిడార్‌లో వర్షం కారణంగా అనేక ప్రాంతాల్లోని రోడ్లపై వరద నీరు చేరింది. దీంతో ఆ ప్రాంతంలో భారీ ట్రాఫిక్? నెలకొంది. దీంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి.



**హైదరాబాద్ వాసులారా అప్రమత్తం**

నగరంలో ఈరోజు రాత్రి వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్? సీపీ సజ్జనార్? సూచించారు. అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప అనవసర ప్రయాణాలు చేయవద్దని చెప్పారు. ఇళ్ల నుంచి బయటకు రావద్దని అన్నారు. బయట ఉన్నవారు వర్ష తీవ్రత పెరిగే లోపే పనులను త్వరగా ముగించుకుని క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని సూచించారు.
ముఖ్యంగా నీరు నిలిచిన రహదారులు, ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల గుండా ప్రయాణాలు చేయడం అస్సలు సురక్షితం కాదని అన్నారు. వాహనదారులు డ్రైవింగ్ చేసేటప్పుడు వేగం తగ్గించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర సమయాల్లో అప్రమత్తంగా ఉంటూ అందరూ సురక్షితంగా ఇళ్లకు చేరుకోవాలన్నారు.
పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షం : క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షం కురుస్తోంది. ఆదిలాబాద్, ఖమ్మం, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందన్నారు.

## గ్రీన్‌ఫీల్డ్.. రయ్‌రయ్

-మొదటిపేజీ తరువాయి

ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు ప్రారంభ స్థానం నుంచి అనుమతిస్తున్నారు.

**2017లో రూ.3,573 కోట్లతో...**

భారత్ మాల ఎకనామిక్ కారిడార్ పథకం కింద ఖమ్మం--దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం చేపట్టారు. తెలంగాణలోని ఖమ్మం జిల్లా ఖమ్మంరూరల్ మండలం తల్లంపాడు నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి సమీపంలో ఉన్న దేవరపల్లి వరకు 165 కిలోమీటర్ల నిడివితో నిర్మించగా, తెలంగాణలో 90 కి.మీ., ఏపీలో 75 కిలోమీటర్ల మేర ఈ రహదారి ఉంటుంది. 2017లో డీపీఆర్ సిద్ధం కాగా, రూ.3,573 కోట్లతో కేంద్రం అనుమతులు మంజూరు చేసింది. 2018 నాటికే భూసేకరణ పూర్తి చేశారు. ఈ రహదారి నిర్మాణంలో పలు అడ్డంకులు ఎదురైనా ఎట్టకేలకు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.

**తగ్గనున్న ప్రయాణ సమయం**

ఈ హైవే అందుబాటులోకి రావడంతో హైదరాబాద్, రాజమండ్రి, విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులు విజయవాడ మీదుగా వెళ్లాల్సిన అవసరం ఉండదు. తద్వారా సుమారు 56 కి.మీ., సూర్యాపేట నుంచి చూస్తే దాదాపు 100 కి.మీ. దూరం తగ్గుతుంది. గతంలో సూర్యాపేట నుంచి విజయవాడ మీదుగా రాజమండ్రి చేరుకోవాలంటే ఆరు గంటల సమయం పట్టేది. కొత్త హైవేతో కేవలం ఐదు గంటల్లోనే గమ్యం చేరుకోవచ్చు. ఈ కారిడార్ ద్వారా ఏపీలోని ఏడు జిల్లాలతో పాటు ఉత్తరాంధ్ర, కోల్‌కతా వరకు నేరుగా అనుసంధానం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.

**ప్రత్యేకతల రహదారి**

ఖమ్మం--దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే అనేక ప్రత్యేకతలను సంతరించుకుంది. తెలుగు రాష్ట్రాల్లోనే మొదటి యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్‌వేగా చెప్పవచ్చు. నిర్ణీత ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద మాత్రమే ప్రవేశం కల్పిస్తూ ప్రతీ 18 కి.మీ.కు ఒక ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ ఏర్పాటు చేశారు. ప్రయాణించిన దూరం ఆధారంగా టోల్ వసూలుకు 'క్లోజ్డ్ టోలింగ్ సిస్టం'ను అందుబాటులోకి తెచ్చారు. భద్రతా కోణంలో ఐదుచోట్ల అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఏటీఎంఎస్), ప్రతీ రెండు కి.మీ.కు 360 డిగ్రీల సీసీ కెమెరాలు, సోలార్ దీపాలు, ప్రతీ ఐదు కి.మీ.కు ఒక ఎమర్జెన్సీ ఓపెనింగ్‌లు ఏర్పాటు చేశారు. అతివేగం, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలను ఏఐ కెమెరాల ద్వారా గుర్తించి నేరుగా చలాన్లు జారీ చేస్తారు. ప్రతీ 50 కిలోమీటర్లకు ఐదు ఎకరాల విస్తీర్ణంలో హోటళ్లు, పెట్రోల్ బంకులు, వాష్‌రూమ్‌ల వంటి సదుపాయాలు కల్పించే పనులు మొదలయ్యాయి. క్యూఆర్ కోడ్ ద్వారా సమీప పోలీస్‌స్టేషన్, పెట్రోల్ బంక్ వివరాలు తెలుసుకునే వెసులుబాటు ఉంది. ఈ హైవేపై గరిష్టంగా గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే వీలుంది.

**గ్రీన్‌ఫీల్డ్ హైవే వివరాలు**

ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు దూరం 165 కి.మీ.
తెలంగాణలో నిడివి 90 కి.మీ.
ఆంధ్రప్రదేశ్‌లో నిడివి 75 కి.మీ.
మొత్తం వ్యయం రూ. 3,573 కోట్లు

## రుణం తీర్చుకునేందుకు పెట్టుబడులతో రండి

-మొదటిపేజీ తరువాయి

ఉంటామని చెప్పారు. తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందని చెప్పారు. పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తూ సింగిల్ విండో విధానంలో అన్ని అనుమతులు అందిస్తున్నామని, ప్రవాసులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్మించిన ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం నేడు తెలంగాణకు పెద్ద ఆస్తులుగా మారాయని గుర్తుచేశారు. ఇప్పుడు ఔటర్ రింగ్ రోడ్డును దాటి మిగతా జిల్లాలను కలుపుతూ రీజినల్ రింగ్ రోడ్ నిర్మిస్తున్నామని, వాటిని అనుసంధానం చేస్తూ కొత్తగా 36 రేడియల్ రోడ్లను ప్లాన్ చేశామని పేర్కొన్నారు. అంతేకాకుండా హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు దీటుగా ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఆ ప్రాంతాన్ని ఆనుకుని సరికొత్తగా 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వివరించారు. మూసీ నది పునరుజ్జీవం వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో హైదరాబాద్ రూపురేఖలు మారనున్నాయని తెలిపారు. ప్రపంచంలోని ఎక్కడున్న తెలంగాణ వాసులైనా.. రాష్ట్రంలో ఉన్న తమ కుటుంబసభ్యుల సమస్యలనైనా ప్రత్యేక వ్యవస్థ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తే సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భట్టి హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కొనసాగుతున్న నేపథ్యంలో విదేశాల్లో ఉన్న తెలంగాణ పౌరులు ఆన్‌లైన్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని గుర్తు చేశారు.

## మళ్లీ తెలంగాణలో ఆ వ్యవస్థ

-మొదటిపేజీ తరువాయి

అమల్లోకి రాకముందు వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ 'బ్లాక్ డెవలప్‌మెంట్ సిస్టమ్'కొనసాగిన విషయం తెలిసిందే. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షాసమావేశం సందర్భంగా మండలాల్లో అన్ని శాఖల అభివృద్ధి పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారుల (ఎంపీడీవో) ద్వారా పర్యవేక్షింపజేయాలని పీఆర్‌శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. మండలస్థాయిలో టీచర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఇతర వ్యవస్థలన్నీ కూడా ఎంపీడీవోకే రిపోర్ట్ చేసేలా చర్యలు ప్రభుత్వం చేపట్టే అవకాశాలున్నాయనే అభిప్రాయం అధికారవర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుతం దేశంలోని మెజారిటీ రాష్ట్రాల్లో బ్లాక్ డెవలప్‌మెంట్ వ్యవస్థ ద్వారానే అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. గతంలో మనరాష్ట్రంలోనూ 2,3 మండలాలకు ఇన్‌చార్జిగా బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు (బీడీవో) వ్యవహరించిన విషయం తెలిసిందే.
అయితే మళ్లీ తెలంగాణలో ఆ వ్యవస్థ అమలు సాధ్యాసాధ్యాలపై అధికారుల్లో సందేహాలు వ్యక్తమౌతున్నాయి. మండలస్థాయిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతి పరిశీలన, అన్ని శాఖలకు సంబంధించిన పనుల పర్యవేక్షణ వంటివి ఎంపీడీవోల ద్వారా చేయొచ్చునేమో కానీ మొత్తం బ్లాక్ డెవలప్‌మెంట్ వ్యవస్థను మళ్లీ రాష్ట్రంలో ప్రవేశపెట్టడం ఏ మేరకు సాధ్యమనే ప్రశ్నలు ముందుకు వస్తున్నాయి. ఆర్థిక పరంగా చూస్తే, బ్లాక్ డెవలప్‌మెంట్ వ్యవస్థ ఎక్కువ నిధులతో, మెరుగైన ఆర్థిక స్వయంప్రతిపత్తిని కలిగి ఉంటుంది. దీనికి భిన్నంగా మండల వ్యవస్థ పరిపాలనా పరంగా ప్రజలకు దగ్గరగా ఉన్నప్పటికీ, నిధులు, ఆర్థిక ఆమోదాల కోసం ఎప్పుడూ రాష్ట్ర ప్రభుత్వం వైపు చూడాల్సి రావడం దీని ప్రధాన బలహీనతగా పరిగణిస్తున్నారు. బ్లాక్ లెవల్ అభివృద్ధి (మధ్యస్థాయి పంచాయతీ) వ్యవస్థ మనదేశంలోని 20కు పైగా రాష్ట్రాలు, ఎంపిక చేసిన కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలులో ఉంది. దేశవ్యాప్తంగా 6,700 కంటే ఎక్కువ మధ్యంతర బ్లాక్ పంచాయతీల ద్వారా పనిచేస్తోంది.

**బ్లాక్ డెవలప్‌మెంట్ 3--అంచెల వ్యవస్థ ఇదీ...**

--మొదటి అంచె (గ్రామ స్థాయి):గ్రామ పంచాయతీ
--రెండవ అంచె (మధ్యస్థ / బ్లాక్ స్థాయి): పంచాయతీ సమితి-- ఇదే బ్లాక్ డెవలప్‌మెంట్ సిస్టమ్
--మూడవ అంచె (జిల్లా స్థాయి): జిల్లా పరిషత్

**మండల వ్యవస్థ ఇలా...**


-- ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఎన్నికల ప్రక్రియ, రాజకీయ పదవుల ఆధారంగా క్షేత్రస్థాయిలో ప్రజలు, నాయకులు దీనిని సహజంగా 5--అంచెల వ్యవస్థగా పరిగణిస్తారు. గ్రామీణ ఓటరు 5 రకాల ప్రతినిధులు/స్థాయిలను చూస్తారు.
-- చట్టప్రకారం ఇవి 3 అంచెలే (గ్రామం, మండలం, జిల్లా) అయినప్పటికీ, అధికారాలు, ఎన్నికల విభజన వల్ల ఇది 5 అంచెలుగా (ఫైవ్ టైర్) కనిపిస్తాయి.
-- గ్రామ పంచాయతీ కింది స్థాయి పాలన (సర్పంచ్‌ల ద్వారా)
-- మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుడు (ఎంపీటీసీ): మండల స్థాయి ప్రజాప్రతినిధి
-- మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ) అధ్యక్షుడు : మండల స్థాయి రాజకీయ అధినేత
-- జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుడు (జడ్పీటీసీ): జిల్లా స్థాయి ప్రజాప్రతినిధి.
-- జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ (జడ్పీపీ) : జిల్లా స్థాయి రాజకీయ అధినేత

# సంపాదకీయం

## 2 లక్షల కోట్ల దాటేస్తున్న జీఎస్టీ

దేశంలో వస్తు సేవల పన్ను సూళ్లు ఇటీవల రూ. 2 లక్షల కోట్ల మైలురాయిని దాటింది. సాధారణంగా జీఎస్టీ రేట్ల ల్యాండ్‌స్కేప్‌లో సంస్కరణలు , రేట్ల సర్దుబాట్లు చేసిన తర్వాత స్వల్పకాలంలో పన్ను ఆదాయం తగ్గుతుందనే అంచనాలు ఉండేవి. అయితే, అనుకున్నదానికి భిన్నంగా రాబడి ప్రతి నెలా పెరుగుతూ వస్తోంది. కేంద్ర ప్రభుత్వం దీనిని పన్ను వ్యవస్థలో పారదర్శకత, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిదర్శనంగా చూపుతున్నప్పటికీ.. నాణేనికి మరోవైపు ఉన్న పన్ను రాబడి స్వభావాన్ని లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది.ఆర్థిక సూత్రాల ప్రకారం, జీఎస్టీ అనేది అడ్ వలోరమ్ పన్ను. అంటే, ఇది ఒక వస్తువు లేదా సేవ తుది విక్రయ ధరపై శాతంగా లెక్కిస్తారు. అంటే ఓ వస్తువు ధర వంద రుపాయలు అయితే దానిపై ట్యాక్స్ 18 శాతం అయితే .. పద్దెనిమిది రూపాయల ట్యాక్స్ కట్టాలి. మార్కెట్‌లో వస్తువుల ధరలు పెరిగినప్పుడు పన్ను శాతం మారకపోయినప్పటికీ, ప్రభుత్వానికి వచే పన్ను మొత్తం ఆటోమేటిక్‌గా పెరుగుతుంది. ఉదాహరణకు, రూ. 100 విలువైన వస్తువుపై 18% జీఎస్టీ పడితే ప్రభుత్వానికి రూ. 18 వస్తుంది. కానీ ద్రవ్యోల్బణం వల్ల అదే వస్తువు ధర రూ. 150కి పెరిగితే, అదే 18% చొప్పున ప్రభుత్వానికి రూ. 27 పన్ను సమకూరుతుంది. అంటే వ్యాపారం లేదా వస్తువుల వినియోగ పరిమాణం పెరగకపోయినా, కేవలం ధరల పెరుగుదల వల్ల కూడా పన్ను వసూళ్లు గణనీయంగా పెరుగుతాయి.ఇటీవలి కాలంలో అంతర్జాతీయంగా అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన సంరక్షణాత్మక వాణిజ్య విధానాలు, సుంకాల యుద్ధాలు, గ్లోబల్ సప్లై చైన్ సమస్యల వల్ల అంతర్జాతీయ మార్కెట్లో చమురు, సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. దీని ప్రభావం భారతీయ మార్కెట్‌పై కూడా పడి నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్స్, ముడిసరుకుల ధరలు పెరగడానికి దారితీసింది. ఆసియా, ఐరోపా మార్కెట్లలో రేగన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వ్యాపార వ్యయాన్ని పెంచడంతో.. ఆ భారం అంతిమంగా వినియోగదారుడిపై పడింది. ధరలు పెరగడం వల్ల ప్రజల జేబుల నుంచి ఎక్కువ సొమ్ము పన్నుల రూపంలో ప్రభుత్వ ఖజానాకు చేరుతోంది.కేవలం రూ. 2 లక్షల కోట్ల జీఎస్టీ రికార్డు కలెక్షన్లను మాత్రమే చూసి దేశంలో ప్రగతి ఉప్పొంగిపోతోందని తీర్మానించడం సమగ్రమైన విశ్లేషణ కాదు. ఈ రాబడిలో ఎంత భాగం నిజమైన ఆర్థిక వృద్ధి ద్వారా వచ్చింది, ఎంత భాగం ద్రవ్యోల్బణం వల్ల పెరిగిందో వేరు చేసి చూడాలి. ఒకవైపు ధరల భారంతో సామాన్య ప్రజల కొనుగోలు శక్తిపై ప్రభావం పడుతుంటే, మరోవైపు అదే ధరల పెరుగుదల ప్రభుత్వానికి రికార్డు రాబడిని తెచ్చిపెడుతోంది. జూలై నెలకు సంబంధించి రీఫండ్‌లు కూడా 13.1 శాతం పెరిగి, రూ. 29,968 కోట్లకు చేరాయి. విదేశీ దిగుమతుల ద్వారా జీఎస్టీ రెవెన్యూ 28.8 శాతం పెరిగింది. వరుసగా జీఎస్టీ వసూళ్లు పెరుగుతుండటం దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి సంకేతం అని నిపుణులు అంటున్నారు. జీఎస్టీ వసూళ్లలో హరియాణా అత్యధిక వృద్ధి సాధించింది. అదే సమయంలో గుజరాత్ రెండో స్థానంలో, తెలంగాణ కూడా భారీ వృద్ధి (19 శాతం) నమోదు చేసింది. మరోవైపు ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లపై ఆర్బీఐ అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్స్ అమలు చేయనున్నట్లు చెప్పింది.దీనిప్రకారం.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (కమర్షియల్ బ్యాంక్స్-ఇంటరెస్ట్ రేట్ ఆన్ డిపాజిట్స్) సెకండ్ అమెండ్‌మెంట్ డైరెక్షన్స్, 2026 ప్రకారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏదైనా ఒక రోజున కస్టమర్లు డిపాజిట్ చేసే మొత్తాలకు, ఒక అమౌంట్‌కు అన్ని బ్రాంచులలో ఒకే వడ్డీ రేటు చెల్లించాలని ఆదేశించింది. బల్క్ డిపాజిట్లతోపాటు అన్ని రకాల డిపాజిట్లపై వేర్వేరు బ్రాంచుల్లో అయినా సరే ఒక అమౌంట్‌కు, ఒకే రకమైన వడ్డీ చెల్లించాలని, ఈ విషయంలో వివక్ష ఉండకూడదని కూడా ఆర్బీఐ ఆదేశించిందిపన్ను సంస్కరణలతో పాటు పన్ను నిఘా పెరగడం సానుకూలాంశమే అయినప్పటికీ, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల వల్ల పెరుగుతున్న పన్ను భారం నుంచి సామాన్యుడికి ఉపశమనం కలిగించే చర్యలపై దృష్టి సారించడమే నిజమైన ఆర్థిక నిర్వహణ అవుతుంది

# పేపర్ లీకేజీలు ఆగిపోవాలంటే..!



భారతదేశంలో ప్రతి సంవత్సరం కోట్లాది మంది విద్యార్థులు, ఉద్యోగార్థులు తమ భవిష్యత్తును నిర్ణయించే పోటీ, ప్రవేశ, నియామక పరీక్షలకు హాజరవుతుంటారు. యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్లు, పోలీస్ నియామకాలు, ఉపాధ్యాయ అర్హత వంటి పరీక్షలు వంటి వ్యవస్థలు దేశంలో అవకాశాల గేట్‌వేలుగా నిలుస్తాయి. గత రెండు దశాబ్దాలుగా ఒక ప్రమాదకరమైన ధోరణి పెరుగుతున్నది. ప్రశ్నాపత్రాల లీకేజీలు, మాస్ కాపీయింగ్, డిజిటల్ మోసాలు, ఇన్‌సైడర్ నెట్‌వర్క్‌లు, పరీక్షల మాఫియా ధోరణి ఎక్కువవుతున్నది. నీట్-2024 వివాదం ఈ సమస్యను జాతీయ చర్చకు తీసుకొచ్చినప్పటికీ, ఇది ఒక్క ఘటన కాదు. 2019 నుంచి కనీసం 65 ప్రధాన పరీక్షల లీకేజీలు లేదా తీవ్రమైన అక్రమాల కారణంగా ప్రభావితమయ్యాయని మీడియా విశ్లేషణలు సూచిస్తున్నాయి. 2004 నుంచి ప్రధాన పరీక్షల లీకేజీల టైమ్‌లైన్: 2005లో ఏఐపీఎంటీ (మెడికల్ ప్రవేశ పరీక్ష) దేశవ్యాప్తంగా వైద్య ప్రవేశ పరీక్షల్లో అక్రమాలు బయటపడ్డాయి. 2015లో ఏఐపీఎంటీ లీక్ అయింది. సుప్రీంకోర్టు జోక్యంతో పరీక్ష రద్దయి, మళ్లీ నిర్వహించాల్సి వచ్చింది.

2017లో ఎస్ఎస్‌సీ సీజీఎల్ వివాదం చెలరేగింది. పరీక్షా కేంద్రాల కంప్యూటర్ల ద్వారా ప్రశ్నలు బయటకు వెళ్లినట్లు ఆరోపణలు వచ్చాయి. దేశవ్యాప్తంగా అభ్యర్థులు నిరసనలు చేపట్టారు. 2017లో నీట్ భద్రతా లోపాలు తలెత్తాయి. 2018లో సీబీఎస్ఈ 10, 12 తరగతుల పేపర్ లీక్ అయ్యాయి. ఎకనామిక్స్, గణిత పరీక్షలు వివాదాస్పదమయ్యాయి. వీటి వల్ల లక్షలాది మంది విద్యార్థులు ప్రభావితమయ్యారు. 2021 యూపీటెట్ లీక్ కావడంతో పరీక్షను రద్దు చేశారు. 2021లో ఆర్ఈఈటీ లీక్ (రాజస్థాన్) అయింది. 2022లో రాజస్థాన్ పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష లీక్ అయింది. 2024లో యూజీసీ-ఎన్ఈటీ రద్దు చేశారు. 2024లో నీట్ యూజీ వివాదం చెలరేగింది. దేశవ్యాప్తంగా 20 లక్షలకు పైగా విద్యార్థులను ప్రభావితం చేసిన ఘటనగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం విచారణను సీబీఐకి అప్పగించింది.

మానవ జోక్యం ఎక్కువగా ఉండటం. ప్రశ్నాపత్రం తయారీ నుంచి ముద్రణ, రవాణా, నిల్వ, పంపిణీ వరకు అనేక దశల్లో మనుషుల ప్రమేయం ఉంటుంది. ప్రింటింగ్ ప్రెస్‌లో భద్రత లోపాలు, డిజిటల్ సైబర్‌లో భద్రత బలహీనతలు, పరీక్షా కేంద్రాల వద్ద అవినీతి, కోచింగ్ మాఫియా, రాజకీయఅధికార రక్షణ, బలహీనమైన ఆడిట్ వ్యవస్థ. ఇలా సుమారు 12 రకాలుగా లీకేజీలు జరుగుతున్నాయని రాధాకృష్ణన్ కమిటీ నివేదికను సమర్పించింది. పరీక్షల లీకేజీల మానవ మూల్యం.. దేశవ్యాప్తంగా పరీక్షల రద్దు, వాయిదాలు, లీకేజీల కారణంగా మానసిక ఒత్తిడి పెరిగిందని అనేక నివేదికలు సూచిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో విద్యార్థుల ఆత్మహత్యలు, తీవ్ర మానసిక కుంగుబాటు, కుటుంబాల ఆర్థిక నష్టం నమోదయ్యాయి. అయితే 'లీకేజీల వల్ల నేరుగా మరణించిన వారి కచ్చిత సంఖ్య' గురించి అధికారిక జాతీయ డాటాబేస్ లేదు. కాబట్టి ఏ సంఖ్యనూ కచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు. ఇటీవల నీట్ యూజీ వివాదం నేపథ్యంలో పలువురు విద్యార్థుల మరణాలు, ఆత్మహత్యలు జాతీయస్థాయిలో చర్చకు వచ్చాయి.

ప్రపంచంలో అతిపెద్ద పరీక్షలు నిర్వహించిన దేశాలు, వాటికి హాజరైన అభ్యర్థుల వివరాలు: గావ్కావో (చైనా), సుమారు 1.31.4 కోట్ల మంది విద్యార్థులు హాజరయ్యారు. నీట్ యూజీ (భారత్), 20 లక్షలకుపైగా హాజరయ్యారు. యూపీఎస్సీ సీఎస్ఈ (భారత్), 1012 లక్షల మంది రాశారు. ఎస్ఎస్‌సీ సీజీఎల్ (భారత్), లక్షల సంఖ్యలో పరీక్షకు హాజరయ్యారు. ఎస్ఏటీ (అమెరికా), 1520 లక్షల మంది రాశారు. జేఈఈ మెయిన్ (భారత్), 10 లక్షలకుపైగా పరీక్ష రాశారు.

ప్రపంచ దేశాలు ఏమి చేస్తున్నాయి? చైనా (గావ్కావో)లో బయోమెట్రిక్ ధృవీకరణ, ఏఐ ఆధారిత పర్యవేక్షణ, ఆర్ఎఫ్ జ్యామర్లు, డ్రోన్ నిఘా వినియోగిస్తున్నాయి. దక్షిణ కొరియాలో పరీక్ష సమయంలో విమానాల మార్గాల్లో మార్పులు చేస్తున్నారు. సింగపూర్‌లో ఎండ్-టు-ఎన్‌క్రిప్టెడ్ ప్రశ్నాపత్రాలు రూపొందిస్తున్నారు. అమెరికాలో క్వశ్చన్ పూల్ ర్యాండమైజేషన్, అడాప్టివ్ టెస్టింగ్ నిర్వహిస్తున్నారు. బ్లాక్‌చెయిన్ క్వశ్చన్ పేపర్ సిస్టమ్ కింద ప్రతి ప్రశ్నాపత్రం డిజిటల్ హ్యాష్‌తో భద్రపరచాలి. లాస్ట్ మినిట్ పేపర్ జనరేషన్: పరీక్షకు 3060 నిమిషాల ముందు మాత్రమే ప్రశ్నాపత్రం రూపొందాలి. జీరో ప్రింటింగ్ మాడల్, కేంద్రాల్లో సురక్షిత ప్రింటింగ్ చేయాలి. ఏఐ సర్వైలెన్స్ ఉండాలి. అసాధారణ కార్యకలాపాలను ఏఐ గుర్తించాలి. బయోమెట్రిక్ ం ఫేస్ రికగ్నిషన్ చేయాలి.

జియో-ఫెన్స్‌డ్ ఎగ్జామ్ సెంటర్స్ ఏర్పాటు చేయాలి. క్వాంటమ్ ఎన్‌క్రిప్షన్ ఉండాలి. మల్టీ సెట్ డైనమిక్ పేపర్స్. ప్రతి అభ్యర్థికీ భిన్నమైన ప్రశ్న క్రమం ఉండాలి. ఇండిపెండెంట్ నేషనల్ ఎగ్జామ్ ఇంటిగ్రిటీ అథారిటీ ఏర్పాటు చేయాలి. రియల్ టైమ్-పబ్లిక్ ఆడిట్ డ్యాష్‌బోర్డు ఉండాలి. ప్రశ్నాపత్రం ముందుగా ఎవరికీ తెలియకూడదు. ముద్రణ అవసరం లేకుండా ఉండాలి. ఏఐ ద్వారా పర్యవేక్షణ ఉండాలి. ప్రతి ప్రశ్నకూ డిజిటల్ ట్రాకింగ్ ఉండాలి. సెంటర్ స్థాయిలో అక్రమాలకు అవకాశం ఉండకూడదు. పరీక్ష అనంతరం ఆటోమేటెడ్ ఫోరెన్సిక్ ఆడిట్ జరగాలి. భారతదేశంలో పరీక్షల సంక్షోభం కేవలం లీకేజీల సమస్య కాదు. ఇది విద్యార్థుల విశ్వాసం, ప్రతిభ, సమాన అవకాశాలపై దాడి. ఒక ప్రశ్నాపత్రం లీక్ అవడం అంటే కేవలం కొన్ని ప్రశ్నలు బయటకు రావడం కాదు; లక్షలాది మంది యువత శ్రమ, కుటుంబాల ఆశలు, దేశ భవిష్యత్తు దెబ్బతినడం.

# నేతన్నల ఇన్ స్టా బాట

**న్యూఢిల్లీ :** దేశ రాజకీయాల్లో ఇప్పుడు గాలి మారింది. ఒకప్పుడు ప్రెస్ మీట్లు, కరపత్రాలతో సాగిన రాజకీయం.. ఆ తర్వాత ఫేస్‌బుక్ కథనాలు, ఎక్స్ వార్లకు మారింది. కానీ ఇప్పుడు ఆ పాత వేదికలన్నీ బామ్మల కాలం నాటి ముచ్చట్లుగా మారిపోయాయి. పొలిటికల్ లీడర్లంతా ఇప్పుడు హుటాహుటిన ఇన్‌స్టాగ్రామ్ బాట పడుతున్నారు. కారణం ఒక్కటే.. ఓటర్లలో నిశ్శబ్దంగా పెద్ద శక్తులుగా మారుతున్న జెన్ జీ ఎక్స్‌ను సమాచారం తెలుసుకోవడానికి వాడుకుంటున్నారు. ఫేస్‌బుక్‌కు అసలు గుడ్ బై చెప్పేశారు. వారు రోజంతా పడికాపులు కాసేది కేవలం ఇన్‌స్టా రీల్స్, షార్ట్స్ లోనే. అందుకే ఇప్పుడు రాజకీయం నడవాలంటే కుడిచేతి బొటనవేలితో స్వైప్ చేసే రీల్స్ పవర్ కావాల్సిందేనని నేతలు డిసైడ్ అయ్యారు.విషయం ఎంత తీవ్రంగా ఉందంటే.. ఏకంగా ప్రధాని నరేంద్ర మోదీ కూడా జెన్ జీ భాషలోనే సంభాషించడానికి ఇన్‌స్టా వేదికగా ఫ్రంట్-కెమెరా సెల్ఫీ వీడియోలు , రీల్స్ పోస్ట్ చేయడం మొదలుపెట్టారు. 10.5 కోట్లకు పైగా ఫాలోవర్లతో డిజిటల్ స్పేస్‌లో ట్రెండ్ సెట్ చేస్తున్న ప్రధాని నుంచి మొదలుకొని, స్థానిక వార్డు మెంబర్ దాకా అందరూ ఇన్‌స్టా అల్గారిథమ్‌ను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ట్విట్టర్ అనేది కేవలం ప్రెస్ రిలీజ్ పోస్ట్ చేసుకునే ఆఫీస్ బోర్డుగా మారిపోగా.. ప్రచారాన్ని, వ్యక్తిత్వాన్ని వైరల్ చేసుకోవడానికి ఇన్‌స్టాగ్రామ్ ఒకే ఒక్క అస్త్రంగా మారింది. యువతను ఆకట్టుకోవాలంటే వారి మైండ్ సెట్‌కు తగ్గట్టుగా కంటెంట్ ఇవ్వాలనే ఉద్దేశంతో పొలిటికల్ వార్ రూమ్‌లు కూడా ఇప్పుడు పిఆర్ ఏజెన్సీలతో రీల్స్ ప్రాజెక్టులు డిజైన్ చేయిస్తున్నాయి.దశాబ్దాలుగా పొడుగాటి పంచెలు, మైకులు పట్టుకుని ఐదు పేజీల మైక్ ఉపన్యాసాలు దంచేసే పాతతరం రాజకీయ నేతలకు.. ఈ 15 సెకన్ల రీల్స్ లాజిక్ అర్థం కాక చమటలు పడుతున్నాయి. జెన్ జీని మెప్పించడం కోసం కెమెరా ముందుకొచ్చి నిలబడటం, కుర్రాళ్లతో కలిసి ట్రెండింగ్ ఆడియోలకు హావభావాలు ఇవ్వడం, నేరుగా ఫోన్ వంక చూస్తూ హేయ్ గైస్ " అని పలకరించడం.. పాపం మన పొలిటీషియన్లకు పెద్ద అగ్నిపరీక్షలా మారింది. సెల్ఫీ యాంగిల్ సరిగ్గా కుదరక, మాట్లాడే స్టైల్ మోతాదు




మించడంతో అనేక మంది నేతల ప్రయోగాలు మీమర్స్ కి కడుపుబ్బ నవ్వించే డైలీ కంటెంట్‌గా మారిపోతున్నాయి.

మరోవైపు ఇన్‌స్టాగ్రామ్ అల్గారిథమ్ చాలా విచిత్రమైనది. అక్కడ గంభీరమైన రాజకీయ ప్రసంగాలు చెల్లవు. జెన్ జీకి నచ్చే సరదా స్లాంగ్ , పాప్ కల్చర్ ట్రెండ్స్, కట్-షార్ట్ ఎడిటింగ్ లేకపోతే ఆ రీల్‌ను క్షణాల్లో పైకి నెట్టేస్తారు. దీంతో పొలిటికల్ పార్టీల సోషల్ మీడియా వింగ్స్.. తమ లీడర్లను ఇన్‌ఫ్లుయెన్సర్లు గా మార్చేందుకు తంటాలు పడుతున్నాయి. ఏ నాయకుడు ఏ బ్రాండ్ టీషర్ట్ వేసుకున్నారు, ఏ కాఫీ షాప్‌లో కూర్చున్నారు, యువతతో కలిసి ఎలాంటి ఫన్నీ కౌంటర్లు వేశారనే కట్-షాట్స్ కోసం ఏకంగా కెమెరా టీమ్‌లను వెంటబెట్టుకుని తిరుగుతున్నారు. నాన్-స్టాప్ పొలిటికల్ పోరాటాల కంటే రీల్స్‌కు వచ్చే లైకులు, కామెంట్లు, షేర్లే ఇప్పుడు నాయకుల పవర్‌ను కొలిచే కొలమానంగా మారాయి.ఓటు బ్యాంకు కోసం లీడర్లు పడే తిప్పలు ఇప్పుడు కేవలం వీధుల్లో పాదయాత్రలకే పరిమితం కాలేదు.. ఇన్‌స్టా స్క్రీన్ల పైకి చేరాయి. జెన్ జీ ఓటర్లను ఆకట్టుకోవడానికి అలవాటు లేని పనులు చేస్తూ, కుర్రాళ్ల ట్రెండ్స్‌ను అనుకరిస్తూ రాజకీయ నాయకులు పడుతున్న ఆర్గానిక్ అవస్థలు సామాజిక మాధ్యమాల్లో రక్తికట్టిస్తున్నాయి. ఎంత కష్టమొచ్చినా సరే.. ట్రెండింగ్ లో లేకపోతే రాజకీయంలో ఉనికికే ప్రమాదమని గుర్తించిన నేతలు, అలవాటు లేని ఈ ఇన్‌స్టా దారిలో కిందామీదా పడుతూ పయనించక తప్పడం లేదు!

## రేవంత్ బాటలో డీకే...

ఎన్నికల సమయంలో వేసే రాజకీయ ఎత్తుగడలు, విమర్శలు వేరని.. రాష్ట్ర అభివృద్ధి, పరిపాలన విషయానికి వచ్చేసరికి కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయడమే నిజమైన రాజధర్మమని కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ నిరూపించారు. శనివారం మైసూరులోని రామకృష్ణ విద్యాలయ ప్రాంగణంలో ప్రతిష్టాత్మక వివేకనంద స్మారక యూత్ సెంటర్ ప్రారంభోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీతో వేదిక పంచుకున్న డికేఎస్, సభాముఖంగా ప్రధానిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా వైరల్ అయ్యాయి."మా ప్రధాని మోదీ ఈ చారిత్రాత్మక వేడుకకు రావడం చాలా గర్వకారణం" అని కొనియాడారు. "రాష్ట్ర అభివృద్ధి విషయంలో మొత్తం కర్ణాటక మీతో నిలబడుతుంది. మనం అంతా కలిసి పనిచేద్దాం. కర్ణాటక అభివృద్ధి చెందితేనే దేశం కూడా వృద్ధి చెందుతుంది. సహకార సమాఖ్య స్ఫూర్తితో కర్ణాటకకు విశాల హృదయంతో సహాయం అందించి, ఆదుకోవాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, తనకు మాట్లాడేందుకు కేవలం ఐదు నిమిషాల సమయం మాత్రమే ఉందని, ప్రధాని మోదీ దేశ ప్రజలకు ఇచ్చే సందేశం చాలా కీలకమైనదని, కాబట్టి తన సమయాన్ని వృథా చేయబోనంటూ ఆయన వేదికపై గౌరవప్రదంగా ప్రసంగాన్ని ముగించడం, ఆ తర్వాత ప్రధాని మోదీ ? డికేఎస్ ఒకరి చేయి ఒకరు పట్టుకుని ఆప్యాయంగా నడుచుకుంటూ వెళ్లడం మీడియాలో హైలైట్ అయ్యింది.రాజకీయాల్లో సైద్ధాంతిక విభేదాలు, విమర్శలు సహజమే అయినప్పటికీ, అధికారంలోకి వచ్చాక కేంద్రంతో వైరం పెట్టుకుంటే నిధుల కేటాయింపులు, మౌలిక వసతుల ప్రాజెక్టులు దెబ్బతిని చివరికి రాష్ట్రానికే తీవ్ర నష్టం జరుగుతుందనే పచ్చి నిజాన్ని డి.కె. శివకుమార్ గుర్తించారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, కేంద్రంతో సత్సంబంధాలు నెరపుతూ రాష్ట్ర ప్రయోజనాలను నెరవేర్చుకోవడమే ఉత్తమ మార్గమని ఆయన భావించారు. రాజకీయ వేదికలపై ప్రత్యర్థులుగా పోరాడినా, పాలనా వ్యవస్థలోకి రాజకీయాలను తీసుకురాకూడదనే ఒక స్పష్టమైన దృక్పథాన్ని ఈ పరిణామం ద్వారా ఆయన చాటిచెప్పారు.

# రంగనాథ్ తప్పిస్తారా !




**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణల తొలగింపు లక్ష్యంగా ఏర్పాటైన హైడ్రా చుట్టూ న్యాయపరమైన ముళ్లకంప అల్లుకుంటోంది. కేవలం ఒక్క రోజు వ్యవధిలోనే లేదా ఒకరి తర్వాత ఒకరుగా ఏకంగా ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులు ఈ ఏజెన్సీ తీరుపై, దాని అధిపతి ఐపీఎస్ అధికారి ఎ.వి. రంగనాథ్ వైఖరిపై తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేయడం రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోంది. బుల్డోజర్ సంస్కృతి, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలకు దిగడం, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేయడం వంటి చర్యలపై న్యాయస్థానం చేసిన ఘాటు వ్యాఖ్యలు హైడ్రా భవిష్యత్తును ప్రశ్నార్థకంలోకి నెట్టాయి. లోతుకుంట భూ వివాదానికి సంబంధించిన కోర్టు ధిక్కరణ కేసులో రంగనాథ్‌ను వెంటనే పదవి నుంచి తప్పించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశించినంది. హైడ్రాను పౌరాణిక రాక్షస మృగంతో పోల్చిన న్యాయమూర్తి, తమను తాము సూపర్ కాప్స్ గా భావించుకోవడం చెల్లదని స్పష్టం చేశారు. కేవలం ఈ ఒక్క బెంచ్ మాత్రమే కాకుండా, ఇతర న్యాయమూర్తులు కూడా వేర్వేరు పిటిషన్లపై విచారణ సందర్భంగా నోటీసులు ఇవ్వకుండా చేపడుతున్న ఆకస్మిక చర్యలను, విచారణాధికారాల అతిక్రమణను తీవ్రంగా తప్పుబట్టారు. స్వయంగా కమిషనర్ రంగనాథ్ దాదాపు 62 కోర్టు ధిక్కరణ కేసుల్లో నిందితుడిగా ఉండటం న్యాయవ్యవస్థ తీవ్రంగా పరిగణించిన అంశంగా మారింది. హైడ్రా చేపట్టిన ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన డ్రీమ్ ప్రాజెక్టుగా, బ్రాండ్ హైదరాబాద్ పునరుద్ధరణగా ప్రచారం చేసుకున్నారు. ప్రారంభంలో ప్రజల నుంచి, పర్యావరణ వేత్తల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించినప్పటికీ, రోజువారీ కార్యకలాపాల్లో చట్టబద్ధమైన ప్రక్రియను పాటించకపోవడమే ప్రస్తుతం ఏజెన్సీకి గొడ్డలిపెట్టుగా మారింది. ప్రతిపక్షాల విమర్శల కంటే కూడా, న్యాయస్థానాలు వరుసగా ఇస్తున్న ప్రతికూల తీర్పులు, వ్యాఖ్యలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రాజకీయంగా, పాలనాపరంగా పెద్ద సవాలుగా పరిణమించాయిహైకోర్టు ఏకంగా సీఎస్‌ను ఉద్దేశించి న్యాయసమ్మతమైన ఆదేశాలను గౌరవించే అధికారిని నియమించండి అని స్పష్టమైన సూచన చేయడంతో ఇప్పుడు బంతి రేవంత్ రెడ్డి కోర్టులోకి చేరింది. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసి రంగనాథ్‌ను అదే పోస్టులో కొనసాగిస్తే, అది ప్రభుత్వం , న్యాయవ్యవస్థ మధ్య మరింత ఘర్షణ వాతావరణానికి దారితీసే ప్రమాదం ఉంది. అంతేకాకుండా, ప్రభుత్వం ఆశించిన హైడ్రా అసలు లక్ష్యం పక్కదారి పట్టి, కేవలం చట్టవిరుద్ధమైన ఏజెన్సీగా ముద్రపడే ప్రమాదముంది. ఈ పరిణామాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరితగతిన నిర్ణయం తీసుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎ.వి. రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించి, మరొక అధికారికి బాధ్యతలు అప్పగించడం ద్వారా కోర్టు ఆదేశాలను గౌరవించినట్లవుతుందని, అలాగే ఏజెన్సీపై పడిన మరకను చెరిపేసి చట్ట పరిధిలోనే ఆక్రమణలపై చర్యలు కొనసాగించవచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. రాబోయే రెండు మూడు రోజుల్లో హైడ్రా నాయకత్వ మార్పుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

రంగనాథ్ పనులకు ఫుల్ పబ్లిసిటీ

హైదరాబాద్ నగరంలో చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు లక్ష్యంగా ఏర్పాటైన హైడ్రా చేపట్టిన సంస్కరణల సత్ఫలితాలు ఇప్పుడు క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు దుర్గంధంతో అలమటిస్తూ, ఆక్రమణల కోరల్లో చిక్కుకుని మురుగు నీటి కుంటలా మారిన ఉప్పల్ నల్లచెరువు'.. నేడు కన్నులపండువగా, ఆహ్లాదకరమైన వాతావరణంతో పునరుజ్జీవం పోసుకుంది. చెరువును ఆధునీకరించి, సుందరీకరించిన తీరుపై ఉప్పల్ నివాసితులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల నుంచి హైడ్రా కమిషనర్ రంగనాథ్ , సిబ్బందిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. కొన్నేళ్లుగా నల్లచెరువు పరివాహక ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు వేయడం, ప్లాస్టిక్ చెత్తతో నింపేయడం, అక్రమ నిర్మాణాలు వెలియడంతో చెరువు తన అస్తిత్వాన్ని కోల్పోయే స్థితికి చేరింది. వర్షం వస్తే చాలు పరిసర కాలనీలైన పీఏసీఎస్ కాలనీ, ఉప్పల్ ప్రధాన రహదారులు జలమయమయ్యేవి. ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించిన హైడ్రా, జీహెచ్‌ఎంసీతో కలిసి సమగ్ర కార్యాచరణను చేపట్టింది. చెరువు పరిధిలోని అక్రమ నిర్మాణాలను తొలగించడమే కాకుండా, టన్నుల కొద్దీ పూడిక, చెత్తాచెదారాన్ని స్వల్పకాలంలోనే తొలగించి చెరువు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచింది. చెరువులోకి మురుగునీరు నేరుగా చేరకుండా డైవర్షన్ ఛానెల్లను ఏర్పాటు చేసి, గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించారు. చెరువు కట్టను బలపరిచి దాని చుట్టూ వాకింగ్ ట్రాక్, విద్యుత్ దీపాలు, సందర్శకుల కోసం సుందరమైన బెంచీలు, పచ్చదనంతో కూడిన ల్యాండ్‌స్కేపింగ్‌ను తీర్చిదిద్దారు. సాయంత్రం వేళల్లో ఉప్పల్ వాసులు, చిన్నారులు, వృద్ధులు ప్రశాంతంగా గడిపేందుకు ఈ ప్రాంతం ఒక అద్భుతమైన వాకింగ్ అండ్ రీక్రియేషన్ స్పాట్ గా రూపాంతరం చెందింది. హైడ్రా పనుల పుణ్యమా అని దుర్గంధం, దోమల బెడద నుంచి విముక్తి లభించిందని, ఆస్తి విలువలు కూడా పెరిగాయని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా చెరువు బిఫోర్ ? ఆఫ్టర్ వీడియోలు, ఫోటోలు విపరీతంగా వైరల్ అవుతున్నాయి. కేవలం కూల్చివేతలకే పరిమితం కాకుండా.. ప్రజాధనం వృథా కాకుండా చెరువులను పునరుద్ధరించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో హైడ్రా తన ప్రత్యేక ముద్రను వేసిందని నెటిజన్లు, ఉప్పల్ వాసులు కొనియాడుతున్నారు.

## కాళేశ్వరం భూ గర్భంలో సమస్యలు



**కరీంనగర్ :** తెలంగాణలో రాజకీయంగా వివాదాస్పద అంశాల్లో ప్రతిష్టాత్మక కాళేశ్వరం ప్రాజెక్ట్ అతిముఖ్యమైనది. భారీ ఖర్చుతో నిర్మించిన ప్రాజెక్టుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మూడేళ్ల నుంచి మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి మరో కీలక విషయం బయటపడింది. ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, మరియు సుందిళ్ల బ్యారేజీల దిగువన భూగర్భంలో అనేక సాంకేతిక లోపాలు ఉన్నట్లు గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్ పరీక్షలలో తేలింది. బ్యారేజీల కొన్ని వెంట్స్ (నీరు ప్రవహించే మార్గాలు) కింద ఖాళీ ప్రదేశాలు ఏర్పడి నీరు చేరడం (కేవిటీస్), పెద్ద పరిమాణంలో బోల్డర్లు, దెబ్బతిన్న రాతి పొరలు, రాళ్ల దిగువ భాగాన పూడిక పేరుకుపోవడం వంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఈ జియోఫిజికల్ పరిశీలనల ఆధారంగా పుణెలోని ప్రసిద్ధ కేంద్ర జల, విద్యుత్తు పరిశోధనా సంస్థ డైరెక్టరు సెల్వబాలన్ ఒక సమగ్ర నివేదికను తెలంగాణ నీటిపారుదల శాఖకు పంపారు. 3 బ్యారేజీల దిగువన సుమారు 30 మీటర్ల లోతు వరకు భూగర్భంలో ఉన్న పరిస్థితులు, సీపేజీ మార్గాలు, అనామలీస్ (భిన్నమైన పరిస్థితులు)ను అధ్యయనం చేయడానికి ఈ అధునాతన జీపీఆర్ పరీక్షలను సీడబ్ల్యూపీఆర్ఎస్ నిర్వహించింది. ఈ అధ్యయనంలో భాగముగా మూడు బ్యారేజీల్లోని మొత్తం 225 వెంట్లకు గాను 217 వెంట్స్ వద్ద క్షేత్రస్థాయి అధ్యయనాలు జరిగాయి. ఈ నివేదికలోని వివరాల ప్రకారం, మేడిగడ్డ బ్యారేజీలోని 7 వెంట్స్ దిగువన అత్యంత తీవ్రమైన అనామలీస్ నమోదయ్యాయి. కీలకమైన మేడిగడ్డలోని 7వ బ్లాక్‌కు చెందిన 17, 18, 19, 20, 21 వెంట్లలోనూ, 8వ బ్లాక్‌లోని 7వ వెంట్‌లోనూ, 5వ బ్లాక్‌లోని 35వ వెంట్‌లోనూ ఈ భూగర్భ లోపాలను గుర్తించినట్లు నివేదికలో తెలిపారు. ఇదే ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీలోని 5వ బ్లాక్‌లో ఉన్న 47వ వెంట్ ఎగువ భాగంలోనూ, సుందిళ్ల బ్యారేజీలో 25, 31, మరియు 53వ వెంట్స్ వద్ద ఎగువ, దిగువ ప్రాంతాలలో సమస్యలు ఉన్నట్లు తేలింది. ఈ 3 బ్యారేజీలలో కలిపి మొత్తం 11 వెంట్స్ కింద మాత్రమే ఎలాంటి సమస్యలు లేదా అనామలీస్ లేవని, మిగతా వాటిలో చిన్న సమస్యలు ఉన్నాయని నివేదికలో వెల్లడించినట్లు సమాచారం. మేడిగడ్డ వద్ద నీటి ఉధృత ప్రవాహాల కారణంగా ఇసుక కొట్టుకుపోయి, రాఫ్ట్ దిగువన పెద్ద ఎత్తున శూన్య ప్రాంతాలు ఏర్పడ్డాయి. 6 వెంట్స్ వద్ద పదికి పైగా విభిన్నమైన అనామలీస్ జోన్లను శాస్త్రవేత్తలు నమోదు చేశారు. ఇటువంటి పరిస్థితులు నీటి అంతర్గత సీపేజ్, పైపింగ్ వంటి ప్రమాదకర పరిణామాలకు దారితీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అయితే, జీపీఆర్ పరీక్షలు కేవలం భూగర్భ పరిస్థితులను అంచనా వేయడానికి మాత్రమే పరిమితమని, నేరుగా స్ట్రక్చరల్ లోపాలను ఇవి నిర్ధారించలేవని సీడబ్ల్యూపీఆర్ఎస్ స్పష్టం చేసింది. అందువల్ల పునరావాస లేదా మరమ్మతు పనులు ప్రారంభించే ముందు బోర్‌హోల్, కోర్ డ్రిల్లింగ్, ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టోమోగ్రఫీ వంటి ఇంజినీరింగ్ పరీక్షలు నిర్వహించడం అనివార్యమని సూచించింది. ప్రాజెక్టు బ్యారేజీల నిర్మాణ సమయంలో ముందస్తు భూగర్భ అన్వేషణ పరీక్షలు చేపట్టకపోవడం వల్లే ఈ సమస్యలు ముందుగా గుర్తించలేకపోయినట్లు ఇంజినీరింగ్ టీమ్ పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం ఈ నివేదికను బయటపెట్టడం గానీ, మంత్రులు, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ అధికారులు గానీ కేంద్ర జల, విద్యుత్తు పరిశోధనా సంస్థ ( సీడబ్ల్యూపీఆర్ఎస్) నివేదికపై స్పందిస్తే మరిన్ని విషయాలు బయిటకు వచ్చే అవకాశం ఉంది

# కాంగ్రెస్‌తో కటీఫ్... మల్లన్న యాక్షన్ ప్లాన్ రెడీ



**హైదరాబాద్ :** చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న ఇప్పుడు తన రాజకీయ ప్రయాణంలో అత్యంత కీలకమైన సవాలును ఎదుర్కొంటున్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన వరంగల్ ఖమ్మం నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం ఆ పార్టీతో తెగదెంపలు చేసుకుని సొంత రాజకీయం మొదలుపెట్టారు. వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న తన పదవీకాలం ముగిసేలోపు మళ్లీ అదే స్థానం నుంచి స్వతంత్ర వేదిక ద్వారా గెలవాలనే లక్ష్యంతో సుదీర్ఘ పాదయాత్రకు రూపకల్పన చేస్తున్నారు. ఈ కొత్త నిర్ణయం ఆయన భవిష్యత్తును పూర్తిగా మార్చే అవకాశం ఉంది. గతానికి ఇప్పటికి మల్లన్న పొలిటికల్ ఇమేజ్‌లో చాలా స్పష్టమైన మార్పు వచ్చింది. ఒకప్పుడు తీన్మార్ మల్లన్న అంటే డిజిటల్ మీడియా ద్వారా ప్రభుత్వాలను అక్రమాలను ప్రశ్నించే హార్డ్‌కోర్ వాయిస్‌గా యూత్‌లో విశేషమైన ఆదరణ ఉండేది. ఆ ప్లాట్‌ఫామ్ తెచ్చిపెట్టిన క్రేజ్‌తోనే ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినప్పుడే లక్షలాది ఓట్లు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆ తదనంతరం కాంగ్రెస్‌లో చేరి ప్రత్యర్థులను తట్టుకుని ఎమ్మెల్సీ పీఠాన్ని అధిరోహించ గలిగారు. కానీ కాలక్రమేణా ఆయన అనుసరించిన విధానాలు మారడంతో ప్రజల్లో ఆయనపై ఉన్న సానుకూల దృక్పథం నెమ్మదిగా కరిగిపోతూ వచ్చింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత ఆయన ఎంచుకున్న రాజకీయ దారి ఆయన పునాదులనే కదిలించిందనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. బీసీ ఐక్యత పేరుతో కొన్ని వర్గాలను ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తూనే ఇతర కులాలను సమాజంలోని కొన్ని విభాగాలను తీవ్రంగా విమర్శిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఈ చర్యలు ఆయనకున్న న్యూట్రల్ ఎడ్యుకేటెడ్ ఓటర్ బేస్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. విద్యావంతులు గ్రాడ్యుయేట్లు ఓటేసే ఎమ్మెల్సీ నియోజకవర్గంలో వ్యక్తిగత దూషణల కంటే ఉద్యోగ ఉపాధి అవకాశాలకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. ఈ క్రమంలో మల్లన్న తన పాత ఇమేజ్‌ను పోగొట్టుకుని దారి తప్పిన నాయకుడిగా మిగిలిపోయారనే విమర్శలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో ఆయనకు కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలం ఓటు బ్యాంకు అండగా ఉండవు. ప్రధాన పార్టీలు ఈ విస్తృత నియోజకవర్గంపై పట్టు సాధించేందుకు క్షేత్రస్థాయి నుంచి పక్కా వ్యూహాలు అమలు చేస్తున్నాయి. కాంగ్రెస్ వైపు నుంచి అధికారిక అభ్యర్థి బరిలో ఉంటారు కాబట్టి పోటీ మరింత తీవ్రంగా ఉంటుంది. ఇలాంటి త్రిముఖ లేదా చతుర్ముఖ పోరులో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ లేకుండా కేవలం సొంత ఇమేజ్‌తో బరిలోకి దిగడం పెద్ద సాహసమే. అందుకే పాదయాత్ర ద్వారా మళ్లీ జనం లోకి వెళ్లి కోల్పోయిన నమ్మకాన్ని పునరుద్ధరించుకోవాలని ఆయన తీవ్రంగా భావిస్తున్నారు. పాదయాత్రలు చేయడం తేలికే అయినా పట్టభద్రుల మైండ్ సెట్‌ను మార్చడం మల్లన్నకు అంత సులభం కాకపోవచ్చు. ఒకవేళ పాదయాత్ర చేసినా కూడా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఓట్లు సాధించలేకపోతే గత కొన్నేళ్లుగా ఆయన చుట్టూ ఉన్న పొలిటికల్ హడావుడి ప్రసహనంలా మారుతుంది. తన పాత ఇమేజ్‌ను తిరిగి తెచ్చుకుని విద్యావంతులను మెప్పించే సరైన అజెండాతో వస్తే తప్ప రాబోయే ఎన్నికల పోరు ఆశాజనకంగా ఉండే అవకాశం లేదు. లేకపోతే ఆయనను పట్టించుకునే వారే కరువవుతారు.

## అభివృద్ధి సంక్షేమంలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి

**బద్వేలు :** బద్వేలు నియోజకవర్గం,అట్లూరు మండలం,అట్లూరు క్రాస్ రోడ్ లో సోమవారం నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి ప్రజలను నేరుగా కలిసి గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎవరికి అయినా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. సంక్షేమం కోసం ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎక్కడా వెనకడుగు వేయడం లేదన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆదాయ వనరులు తక్కువగా ఉన్నప్పటికీ అభివృద్ధి మరియు సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.×అభివృద్ధి విషయంలో గతంలో ఎన్నడూ లేనంతగా గుంతలు లేని రహదారుల నిర్మాణం చేపట్టామని తెలిపారు. అలాగే అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడంతో పాటు భోగాపురం విమానాశ్రయం ప్రారంభం కూడా రాష్ట్ర అభివృద్ధికి దోహదపడిందన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, అట్లూరు మండల నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఇప్పుడు అదిలాబాద్ ఎయిర్ పోర్టు క్రెడిట్ వార్



**అదిలాబాద్ :** ఏపీలో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ప్రారంభం కాగా, దీనిపై కూటమి ప్రభుత్వం, వైఎస్సార్ సీపీ ఇది తమ ఘనతేనని క్లెయిమ్ చేస్తున్నాయి. తమ హయాంలోనే దాదాపు ఎయిర్ పోర్ట్ పనులు పూర్తికాగా, సీఎం చంద్రబాబు ఫినిషింగ్ వర్క్స్ పూర్తి చేశారని వైసీపీ అంటోంది. తాము ఏది సాధించినా క్రెడిట్ తమ ఖాతాలో వేసుకోవడం వైసీపీకి అలవాటు అయిందంటూ కూటమి నేతలు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ విషయంలోనూ క్రెడిట్ గేమ్ మొదలైంది. సాధించింది తామేనని బీజేపీ నేతలు చెబుతంటే, బీజం వేసింది తానేనని, మంజూరు చేసింది కాంగ్రెస్ పార్టీ అని మాజీ ఎంపీ సోయం బాపూరావు వ్యాఖ్యానించారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ మంజూరు, పనులకు అనుమతులపై మాజీ ఎంపీ సోయం బాపూరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిలాబాద్ లో ఎయిర్ పోర్ట్ మంజూరు చేసింది కాంగ్రెస్ పార్టీనే అని, దానికి గతంలో బీజం వేసింది తానేనని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు హాజరయ్యారు. ముందుగా గ్రామనికి చేరుకున్న నాయకులకు స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం పార్టీ బలోపేతం కోసం దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పార్టీ శ్రేణఉలకు పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ సోయం బాపూరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కృషితో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నాలతో ఆదిలాబాద్ జిల్లా కు ఎయిర్ పోర్ట్ మంజూరు అయ్యిందన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడే ఆదిలాబాద్ జిల్లాకు విమానాశ్రయం కోసం అప్పటి కేంద్ర మంత్రులకు ప్రధానికి వినతిపత్రాలు ఇచ్చానని, అంటే ఈ ఎయిర్‌పోర్ట్ కోసం ముందస్తుగా బీజం వేసింది తానేనని గుర్తు చేశారు. దానికి సాక్షం బీజేపీ ఎమ్మెల్లే పాయల్ శంకర్ అన్నారు. కానీ స్థానిక ఎమ్మెల్లే, బీజేపీ నాయకులు తామే ఆదిలాబాద్ కు విమానాశ్రయం తెచ్చింది తామేనని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ చేస్తే స్థానిక ఎమ్మెల్లే శంకర్ తానే చేస్తున్నానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ రేషన్ కార్డులు ఇచ్చిందని, రైతులకు రుణమాఫీ చేసిందన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ప్రయాణం కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని దీన్ని పార్టీ కార్యకర్తలు ప్రజల వద్దకు తీసుకెళ్లి వివరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యేను ఓడగొట్టడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కార్యకర్తలు సైనికుల్లా పని చెయ్యాలని పిలుపునిచ్చారు

నవగీతం
తెలుగు దినపత్రిక
మంగళవారం
4 ఆగస్టు 2026

## మెగా యూత్ ఫోర్స్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ గా కాస రాజు నియామకం




**హైదరాబాద్,ఆగస్టు3 (నవగీతం):** తెలంగాణ మెగా అభిమానుల మెగా యూత్ ఫోర్స్ జాయింట్ కన్వీనర్ గా కాసరాజును నియమిస్తున్నట్లు కొణిదెల సుస్మిత హైదరాబాదులో కాసరాజుకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షురాలు సుస్మిత మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా మెగా అభిమాన సంఘంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన కాస రాజుని గుర్తిస్తూ ఆయనకు ఈ పదవి ఇవ్వడం జరిగిందని రానున్న రోజుల్లో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని తెలిపారు ఇకనుండి మెగా హీరోల అభిమానులందరూ మెగా యూత్ ఫోర్స్ ద్వారానే కార్యక్రమాలను నిర్వహించాలని ఆమె పిలుపునిచ్చారు అనంతరం కాస రాజు మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన మెగా హీరోలందరికీ కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షులు రవణం స్వామినాయుడు, మెగా యూత్ ఫోర్స్ జాతీయ కన్వీనర్ ఏడిద బాబి మరియు రాష్ట్ర కార్యవర్గం పాల్గొన్నారు

## అర్జీదారులు అందించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత నివ్వాలి:

కలెక్టర్ బోర్ఢేడే హేమంత్ సహదేవరావు.





**ములుగు.ఆగస్టు 03.(నవగీతం)** ములుగు జిల్లా కేంద్రంలో ములుగు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు అందించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ సమావేశాలు మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా అదనపు కలెక్టర్లు, సి.హెచ్. మహేందర్ జి.సంపత్ రావు లత కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తుల స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 67 దరఖాస్తులు రాగా అందులో భూ సమస్యలు 11,ఇందిరమ్మ ఇల్లు 18, పెన్షన్లు 26,ఇతర శాఖకు సంబంధించి 12 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధించిన శాఖల అధికారులకు పంపించడం జరిగిందని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ప్రజలకు జవాబుదారితనంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. గత వారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా కారణాలవల్ల క్రింది స్థాయి కార్యాలయాల్లో సమస్యను పరిష్కరించకపోతే వాటికి సంబంధించి పూర్తి వివరాలను ఫిర్యాదుదారునికి తెలియజేయాలని, పై స్థాయి కార్యాలయంలోని అధికారికి సమస్యను ఏ విధంగా తెలియజేయాలో క్షుణ్ణంగా వివరించాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితులలోనూ ప్రజావాణి దరఖాస్తులు అధికారుల వద్ద పెండింగ్ లో ఉండకూడదని ఆదేశించారు. ముఖ్యమంత్రికూడా ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నుంచి వచ్చిన దరఖాస్తులను అధిక ప్రాధాన్యత నిస్తూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, ఎస్ డి టి ప్రతాప్, అన్ని జిల్లా శాఖకు సంబంధించిన అధికారులు, అన్ని మండలాల ఎమ్మార్వోలు ,ఎంపీడీవోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యాయత్నానికి పాల్పడబోయిన వ్యక్తిని సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ సుమన్‌ను అభినందించిన జిల్లా ఎస్పీ



**రాయికల్, ఆగస్టు3,(నవగీతం)** రాయికల్ మండలానికి చెందిన బోడి నాగరాజు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని తన కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేశాడు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెంటనే డయల్-100కు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు అప్రమత్తమై నాగరాజు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మూటపల్లి ప్రాంతంలో ఆయనను గుర్తించిన పోలీసులు, అప్పటికే పురుగుల మందు సేవించిన నాగరాజును గుర్తించి ఆలస్యం చేయకుండా వెంటనే కుటుంబ సభ్యులకు సబ్యులకు సమాచారం అందించి సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ మాట్లాడుతూ,అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే డయల్-100 కు సమాదనం అందించాలని సూచించారు. విధి నిర్వహణలో అప్రమత్తత, సమయస్ఫూర్తి, మానవత్వంతో స్పందించడం ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యత అని అన్నారు.బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ సుమన్ వేగంగా స్పందించి గాలింపు చేపట్టి ఒక విలువైన ప్రాణాన్ని కాపాడడం అభినందనీయమని కొనియాడారు.అలాగే, ఆత్మహత్య ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం కాదని, జీవితంలో ఎలాంటి కష్టాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు లేదా వ్యక్తిగత ఒత్తిడులు ఎదురైనా ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు.

## కరాటే పోటీల్లో వైరా విద్యార్థుల సత్తా

సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్‌లో పతకాల పంట




**వైరా,ఆగస్టు3,(నవగీతం):** సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్ లీగ్స్ - 2026 పోటీల్లో వైరాకు చెందిన కరాటే విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి విజృంభించారు. వైరా నియోజకవర్గ కేంద్రంలోని ఖమ్మంలో గల టిఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో ఈ కరాటే పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో రఘు మాస్టర్ వద్ద శిక్షణ పొందుతున్న వైరా విద్యార్థులు పాల్గొని విశేష ప్రతిభ చాటారు. మొత్తం 12 స్వర్ణ పతకాలు , 9 రజత పతకాలు సిల్వర్ మెడల్స్ 11 కాంస్య పతకాలు బ్రోంజ్ మెడల్స్ సాధించి వైరా పేరును నిలబెట్టారు. టూర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులను, వారికి ఉత్తమ శిక్షణ అందించిన కరాటే మాస్టర్ జి. రఘును ప్రజలు, స్థానికులు అభినందించారు.

## డ్రైనేజీ సమస్యపై మున్సిపల్ చైర్మన్ తక్షణ స్పందన



**మెట్ పల్లి, ఆగస్టు3,(నవగీతం):** మెట్‌పల్లి బస్‌స్టాండ్ ఔట్‌గేట్ వద్ద డ్రైనేజీ సమస్యపై మున్సిపల్ చైర్మన్ తక్షణ స్పందన మెట్‌పల్లి బస్‌స్టాండ్ ఔట్‌గేట్ సమీపంలో డ్రైనేజీ మూసుకుపోవడంతో మురుగు నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించిన మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి వెంటనే స్పందించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి, డ్రైనేజీ శుభ్రపరిచే పనులను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించి, మురుగు నీటి పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ నునుగొండ నరేష్, కాంగ్రెస్ నాయకులు మైలారపు రాంబాబు మున్సిపల్ డి ఈ నాగేశ్వర్ రావు,అధికారులు, డిపో మేనేజర్ పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డేలో ప్రజా ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ అశోక్ కుమార్



**జగిత్యాల, ఆగస్టు3,(నవగీతం):** జిల్లా ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడం, బాధితుల సమస్యలను నేరుగా తెలుసుకొని త్వరితగతిన పరిష్కరించడం లక్ష్యంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రజల నుండి వచ్చిన పలు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 26 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను ఎస్పీ కి నేరుగా వివరించారు. ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యను జిల్లా ఎస్పీ తెలుసుకొని సంబంధిత పత్రాలను పరిశీలించి ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో పరిష్కరించగల సమస్యలను ఆలస్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని, విచారణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. జిల్లా పోలీసు శాఖ ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించేందుకు కట్టుబడి ఉందని, ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తోందని ఎస్పీ తెలిపారు.

## మెట్‌పల్లి చెరువు గండి సమస్యకు తక్షణ పరిష్కారం చైర్మన్ మైలారపు లింబాద్రి



**మెట్ పల్లి,ఆగస్టు3,(నవగీతం)** మెట్‌పల్లి చెరువులో గండి ఏర్పడిన విషయాన్ని గుర్తించిన మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి వెంటనే స్పందించి, సంబంధిత అధికారులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గండి పూడ్చివేత పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జేసీబీల సహాయంతో పనులు ప్రారంభించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ రెబ్బాస్ మహేష్ ,10వ వార్డ్ కౌన్సిలర్ నునుగొండ నరేష్ 4వ వార్డ్ కౌన్సిలర్ పందిరి రమేష్ కాంగ్రెస్ నాయకులు మైలారపు రాంబాబు , మున్సిపల్ డి ఈ నాగేశ్వర్ రావు మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొని పనులను పర్యవేక్షించారు.

## పొలంలో నాట్లు వేస్తూ విద్యార్థులకు వ్యవసాయ పాఠాలు చెప్పిన ఉపాధ్యాయుడు.

అందరినీ ఆలోచింప చేసిన ఉపాధ్యాయుడు. విజయ్.

**ములుగు, ఆగస్టు3 (నవగీతం).** ములుగు జిల్లా నూగూరు వెంకటాపురం మండలంలోని మరికాల కొత్తూరు పాఠశాలయందు నేటి తరం విద్యార్థులకు వ్యవసాయం విలువ, రైతు కష్టం, ప్రకృతితో అనుబంధం గురించి ప్రత్యక్షంగా తెలియజేయాలని మరికాల కొత్తూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కాపుల విజయ్ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు.





ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులను సమీపంలోని వరి పొలానికి తీసుకెళ్లి, రైతుల సహకారంతో స్వయంగా వరి నాట్లు వేయించారు. ఈ సందర్భంగా వరి సాగు విధానం, నారు పెంచడం, పొలం సిద్ధం చేయడం, నాట్లు వేయడం, పంట సంరక్షణ, నీటి నిర్వహణ, పంట కోత వరకు జరిగే ప్రతి దశను విద్యార్థులకు సులభంగా వివరించారు. విద్యార్థులు బురదలోకి దిగి ఉత్సాహంగా నాట్లు వేస్తూ రైతు శ్రమను ప్రత్యక్షంగా అనుభవించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు కాపు విజయ్ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల్లో చదివే అంశాలను క్షేత్రస్థాయిలో చూపించడం వల్ల విద్యార్థులకు వ్యవసాయం పట్ల ఆసక్తి పెరగడంతో పాటు, అన్నదాత పట్ల గౌరవభావం కూడా పెరుగు తోందని, “దేశానికి అన్నం పెట్టే రైతు గొప్పతనాన్ని చిన్నప్పటి నుంచే పిల్లలకు తెలియజేయాలి. విద్యతో పాటు జీవిత నైపుణ్యాలు, ప్రకృతి పట్ల ప్రేమ, వ్యవసాయం పట్ల అవగాహన పెంపొందించడం కూడా పాఠశాలల బాధ్యత” అని అన్నారు. ఈవిషయాన్ని గమనించిన గ్రామస్థులు, రైతులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఇటువంటి అనుభవాత్మక బోధన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో వ్యవసాయం పట్ల చైతన్యం, శ్రమకు గౌరవం, ప్రకృతి పరిరక్షణపై బాధ్యత పెంపొందించడంలో ఈ కార్యక్రమం ఆదర్శప్రాయంగా నిలిచిందని కొనియాడారు.

## తల్లిపాలు అమృతం లాంటివి: జగిత్యాల సిడిపిఓ జయప్రద.



**జగిత్యాల,ఆగస్టు 3,(నవగీతం):** తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని పుట్టిన అరగంటలోపే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని జగిత్యాల సిడిపిఓ జయప్రద అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం జగిత్యాల అర్బన్ 1వ సెక్టార్ లోని అంగన్వాడీ కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 26వ వార్డు కౌన్సిలర్ పులి రమ, సిడిపిఓ జయప్రద పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపివో మాట్లాడుతూ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించడం వల్ల బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ముర్రుపాలు మొదటి టీకా లాగా పని చేస్తుందన్నారు. ఆరు నెలలు నిండేదాక తల్లిపాలు తప్ప ఎలాంటి ద్రవపదార్థాలు ఇవ్వకూడదన్నారు. బిడ్డలకు పాలు ఇవ్వని తల్లులకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. గర్భవతులు ఆకుకూరలు, తాజా కూరగాయలు తీసుకోవాలని, ఆయెడిన్ ఉప్పు , పప్పు దినుసులు ఎక్కువ శాతం తీసుకుంటే ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. అంగన్వాడి కేంద్రాలలో అందించే పోషకాహారాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఏడు నెలల పిల్లలకు బాలామృతాన్ని కచ్చితంగా తినిపించాలని అందులో ఐరన్, ఎ, బి.సి విటమిన్లతో పాటు ఫోలిక్ యాసిడ్ ఉంటుందని ఇవి ఎదిగే బిడ్డలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. ఈ సందర్భంగా ఏడు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు మమత, కవిత అంగన్వాడీ టీచర్లు దయావతి, యతీశ్వరి, సౌజన్య, ఏఎన్ఎం శిరీష, ఆశ లావణ్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

సత్వర పరిష్కారమే అధికారుల లక్ష్యం కావాలి..

అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే





**కరీంనగర్, ఆగస్టు 3,(నవగీతం):** ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,ఆర్డీవో షర్మిల, డీఆర్ఓ స్వామితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 212 దరఖాస్తులు అందగా, అత్యధికంగా కరీంనగర్ ఆర్డీవో కార్యాలయానికి 66, గృహ నిర్మాణ శాఖకు 44 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.ప్రజావాణి దరఖాస్తులు, కోర్టు కేసులు అనవసరంగా పెండింగ్‌లో ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం జరిగేలా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

## తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించాలి

అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



**కరీంనగర్,ఆగస్టు3,(నవగీతం)** తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ అన్నారు. ఈనెల 7 వరకు నిర్వహించనున్న తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్ ను అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గ్రామస్థాయిలో గర్భిణీలు బాలింతలు, కుటుంబ సభ్యులకు తల్లిపాల ఆవశ్యకతను వివరించాలని తెలిపారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని ప్రతి ఒక్కరికి తెలియజేయాలని, ముర్రుపాలలోని రోగనిరోధక శక్తి వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతాడని తెలిపారు. మహిళ, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను సందర్శించి అక్కడి గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యంపై కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. పుట్టినప్పటి నుండి ఆరు నెలలు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని, రెండు సంవత్సరాల వరకు కొనసాగించాలనే విషయాన్ని తెలియజేయాలన్నారు. ముఖ్యంగా స్వయం సహాయక సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధుల సహకారంతో అవగాహన సమావేశ ఏర్పాటు చేసి తల్లిపాల ప్రాముఖ్యం వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఐసిడిఎస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంలో అసలైన పాత్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదే

**విశాఖపట్నం :** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణంలో అసలైన పాత్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదేననే విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని వైఎస్సార్సీపీ నాయకుడు గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. భూసేకరణ పూర్తి చేయడం, కోర్టు చిక్కులను తొలగించడం, నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం వంటి కీలక నిర్ణయాలు జగన్ హయాంలోనే జరిగాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు, చంద్రబాబు ‘కొబ్బరికాయ కొట్టింది నేనే, గుమ్మడికాయ కట్టింది నేనే’ అని ప్రగల్భాలు

## గ్రీన్‌ఫీల్డ్.. రయ్‌రయ్

-మొదటిపేజీ తరువాయి

ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు ప్రారంభ స్థానం నుంచి అనుమతిస్తున్నారు.

**2017లో రూ.3,573 కోట్లతో...**

భారత్ మాల ఎకనామిక్ కారిడార్ పథకం కింద ఖమ్మం--దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం చేపట్టారు. తెలంగాణలోని ఖమ్మం జిల్లా ఖమ్మంరూరల్ మండలం తల్లంపాడు నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి సమీపంలో ఉన్న దేవరపల్లి వరకు 165 కిలోమీటర్ల నిడివితో నిర్మించగా, తెలంగాణలో 90 కి.మీ., ఏపీలో 75 కిలోమీటర్ల మేర ఈ రహదారి ఉంటుంది. 2017లో డీపీఆర్ సిద్ధం కాగా, రూ.3,573 కోట్లతో కేంద్రం అనుమతులు మంజూరు చేసింది. 2018 నాటికే భూసేకరణ పూర్తి చేశారు. ఈ రహదారి నిర్మాణంలో పలు అడ్డంకులు ఎదురైనా ఎట్టకేలకు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.

**తగ్గనున్న ప్రయాణ సమయం**

ఈ హైవే అందుబాటులోకి రావడంతో హైదరాబాద్, రాజమండ్రి, విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులు విజయవాడ మీదుగా వెళ్లాల్సిన అవసరం ఉండదు. తద్వారా సుమారు 56 కి.మీ., సూర్యాపేట నుంచి చూస్తే దాదాపు 100 కి.మీ. దూరం తగ్గుతుంది. గతంలో సూర్యాపేట నుంచి విజయవాడ మీదుగా రాజమండ్రి చేరుకోవాలంటే ఆరు గంటల సమయం పట్టేది. కొత్త హైవేతో కేవలం ఐదు గంటల్లోనే గమ్యం చేరుకోవచ్చు. ఈ కారిడార్ ద్వారా ఏపీలోని ఏడు జిల్లాలతో పాటు ఉత్తరాంధ్ర, కోల్‌కతా వరకు నేరుగా అనుసంధానం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.

**ప్రత్యేకతల రహదారి**

ఖమ్మం--దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే అనేక ప్రత్యేకతలను సంతరించుకుంది. తెలుగు రాష్ట్రాల్లోనే మొదటి యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్‌వేగా చెప్పవచ్చు. నిర్ణీత ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద మాత్రమే ప్రవేశం కల్పిస్తూ ప్రతీ 18 కి.మీ.కు ఒక ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ ఏర్పాటు చేశారు. ప్రయాణించిన దూరం ఆధారంగా టోల్ వసూలుకు 'క్లోజ్డ్ టోలింగ్ సిస్టం'ను అందుబాటులోకి తెచ్చారు. భద్రతా కోణంలో ఐదుచోట్ల అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఏటీఎంఎస్), ప్రతీ రెండు కి.మీ.కు 360 డిగ్రీల సీసీ కెమెరాలు, సోలార్ దీపాలు, ప్రతీ ఐదు కి.మీ.కు ఒక ఎమర్జెన్సీ ఓపెనింగ్‌లు ఏర్పాటు చేశారు. అతివేగం, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలను ఏఐ కెమెరాల ద్వారా గుర్తించి నేరుగా చలాన్లు జారీ చేస్తారు. ప్రతీ 50 కిలోమీటర్లకు ఐదు ఎకరాల విస్తీర్ణంలో హోటళ్లు, పెట్రోల్ బంకులు, వాష్‌రూమ్‌ల వంటి సదుపాయాలు కల్పించే పనులు మొదలయ్యాయి. క్యూఆర్ కోడ్ ద్వారా సమీప పోలీస్‌స్టేషన్, పెట్రోల్ బంక్ వివరాలు తెలుసుకునే వెసులుబాటు ఉంది. ఈ హైవేపై గరిష్టంగా గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే వీలుంది.

**గ్రీన్‌ఫీల్డ్ హైవే వివరాలు**

ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు దూరం 165 కి.మీ.
తెలంగాణలో నిడివి 90 కి.మీ.
ఆంధ్రప్రదేశ్‌లో నిడివి 75 కి.మీ.
మొత్తం వ్యయం రూ. 3,573 కోట్లు

## గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ పనుల్లో వేగం పెంచండి

-మొదటిపేజీ తరువాయి

మడ అడవుల విస్తరణలో దేశంలో రెండో స్థానం సాధించడం ద్వారా జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చినందుకు కృషి చేసిన అధికారులకు పవన్ కల్యాణ్ అభినందనలు తెలియజేశారు. ఎల్?నినో వంటి అసాధారణ వాతావరణ పరిస్థితుల నుంచి తీరాన్ని రక్షించుకోవడంలో గ్రీన్ వాల్ ప్రాజెక్టు కీలకమన్నారు. 1053 కిలోమీటర్ల తీరం పొడవునా 5 కిలోమీటర్ల వెడల్పున హరితగోడను ఏర్పాటు చేస్తున్నామని ఈ ఏడాది 8888 హెక్టార్లలో గ్రీన్ వాల్ విస్తరణ జరగనుందని వివరించారు. తాటి చెట్లు గాలి నిరోధక వ్యవస్థగా నిలుస్తాయని చెప్పారు. అందుకే తాటివనాలు, సామాజికవనాల ఏర్పాటు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని పవన్ సూచించారు.

727 హెక్టార్లలో : మడ అడవుల స్థాపనకు అక్టోబర్ నుంచి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని, ఈ ఏడాది మరింత వేగంగా కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని అధికారులను పవన్ ఆదేశించారు. గ్రీన్ వాల్ కార్యాచరణ ప్రణాళికల్లో భాగంగా 5000ల హెక్టార్లలో తాటి వనాలు నాటుతున్నామని, గ్రీన్ క్లైమేట్ ఫండ్ కింద మరో 1993 హెక్టార్లను దేశీయ మొక్కలతో నింపుతామని వివరించారు. 727 హెక్టార్లలో షెల్టర్ బెల్ట్ ప్లాంటేషన్లు లక్ష్యాలుగా నిర్దేశించినట్లు చెప్పారు. గ్రేట్ గ్రీన్ వాల్ కింద 5 కిలోమీటర్ల వెడల్పుతో తీరానికి మూడంచెల రక్షణ వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు.

మొదటి వలయంలో మడ అడవుల పునరుద్ధరణ, షెల్టర్ బెల్ట్‌ల మొక్కల పెంపకం, రెండు, మూడు వలయాలను కమ్యూనిటీ బఫర్ జోన్లుగా గుర్తించి గ్రామ వనాలు, సామాజిక వనాలు, వ్యవసాయ వనాల పెంపకాన్ని ప్రజలు, వివిధ శాఖల సమన్వయంతో చేపడుతున్నట్లు పవన్ కల్యాణ్ వివరించారు. గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకెళ్తోందనని చెప్పారు. ఏపీ గ్రీనింగ్ అండ్ క్లైమెట్ ఛేంజ్ మిటిగేషన్ సొసైటీ ద్వారా గ్రీన్?వాల్ లక్ష్య సాధన దిశగా అన్ని శాఖలను సమన్వయం చేస్తున్నట్లు పవన్? కల్యాణ్? తెలిపారు.

## రేపు దేవరపల్లిలో వైఎస్ జగన్ పర్యటన

-మొదటిపేజీ తరువాయి

పర్యటనలో భాగంగా బుధవారం ఉ.9.30 గంటలకు వైఎస్ జగన్ తాడేపల్లిలో బయల్దేరి, ఉ.10.30కు దేవరపల్లి చేరుకుంటారు. అక్కడి పొగాకు కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న కొనుగోళ్లను పరిశీలిస్తారు. అనంతరం.. పొగాకు రైతులతో ముఖాముఖి నిర్వహించి, పంట సాగు, గిట్టుబాటు ధర, కొనుగోళ్లు, సమస్యలు తదితర అంశాలను నేరుగా వారిని అడిగి తెలుసుకుంటారు.

## వీర మహిళలకు పెద్ద పీట....


**కాకినాడ :** జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. పార్టీ పదవుల్లోనూ, ఇకపై ప్రభుత్వ నియామకాల్లోనూ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. గత కొన్ని రోజులుగా పార్టీ పదవులపై కసరత్తుచేస్తున్న పవన్ కల్యాణ్ జనసేనలో మహిళలకు ప్రాధాన్యత తక్కువగా ఉందని గుర్తించారు. అలాగని జనసేనలో మహిళనేతలకు కొదవలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక మహిళకు మాత్రమే అవకాశం ఇచ్చారు. నామినేటెడ్ పదవుల్లో కొందరికి కట్టబెట్టినా వారు పెద్దగా హైలెట్ కాలేదు. అందుకే ఈసారి పార్టీ పదవుల్లో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కల్యాణ్ నిర్ణయించినట్లు తెలిసింది. నేతలు ఏదో ఒక వివాదంలో చిక్కుకోవడం పవన్ కల్యాణ్ కు ఇబ్బందిగా మారింది. అదే మహిళలయితే పార్టీ కోసం, తన మాటకు కట్టుబడి నియోజకవర్గంలో పనిచేస్తారని భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ మహిళలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినా, ముందుగా పార్టీ పదవుల్లో వారికే అగ్రతాంబూలం ఇవ్వాలని పవన్ కల్యాణ్ డిసైడ్ అయినట్లు తెలిసింది. నియోజకవర్గాల ఇన్ ఛార్జుల విషయంలో జరుపుతున్న కసరత్తులో మహిళ పేర్లను ఎక్కువగా పవన్ పరిశీలిస్తున్నారని అంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి మహిళ రిజర్వేషన్లు కూడా అమలు కానుండటంతో పాటు మహిళలయితే వివాదాలకు దూరంగా ఉంటారని పవన్ కల్యాణ్ విశ్వసిస్తున్నారు. జనసేనలో వీర మహిళలకు ప్రత్యేక స్థానం ఉంది. దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ వీర మహిళలున్నారు. వారిలో బలమైన సామాజికవర్గం, ఆర్థిక పరిస్థితులను చూసిన తర్వాత పార్టీ పదవులకు ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. జిల్లా అధ్యక్షులుగా కూడా ఎక్కువ మంది మహిళలకు అవకాశమిస్తే తమకు రాజకీయంగా మైలేజీ దొరకడమే కాకుండా, ఇబ్బందులు కూడా ఉండవని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అనేక జిల్లాల్లో పార్టీ జిల్లా అధ్యక్షులు నాయకత్వం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా పనిచేయకపోవడంతో ప్రకాశం, నెల్లూరు జిల్లాల పార్టీ కార్యవర్గాన్ని అప్పట్లో రద్దు చేశారు. ఇప్పుడు దాదాపు అన్ని పదవులు రద్దయ్యాయి. అలాగే పార్టీ అధికార ప్రతినిధులుగా మహిళలకే చోట కల్పించాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి

## వైసీపీలో సాహూ ఆన్ డ్యూటీ..

**విజయవాడ :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ వచ్చే ఎన్నికలలో గెలుపు కోసం ఎన్నికల వ్యూహకర్తను మార్చినట్లు తెలిసింది. కపిల్ సాహును ఆయన నియమించుకున్నారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. జగన్ పర్యటనలను డిజైన్ చేయడంతో పాటు ఇప్పటికే

## డిగ్రీ కళాశాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి

ఆర్డీవో కి వినతి పత్రం అందజేసిన ధోనీకేల నవీన్





**మెట్ పల్లి,ఆగస్టు3,(నవగీతం)** మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై బీజేపీ పట్టణ అధ్యక్షులు ధోనికెలనవీన్ ఆధ్వర్యంలో భాజపా కార్యకర్తలతో కలిసి కళాశాలను సందర్శించారు.ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షుడు ధోనీకేల నవీన్ మాట్లాడుతూప్రభుత్వ డిగ్రీ కళాశాల లో చదువుకుంటున్న విద్యార్థులు సౌకర్యాలు లేక నరకయాతన భరిస్తున్నారని తరగతి గదిలో నాగుపాములు, నాగు పూసలతో విషపురుగుల మధ్యన చదువుకుంటున్నారని కళాశాల ముందు కాంపౌండ్ వాల్ లేక చెరువును తలపించేలా పూర్తిగా నీటిమయమైందని పక్కనే సబ్‌స్టేషన్ ఉండడం కారణంగా విద్యుత్ ఎర్తింగ్ తో జంతువులు కరెంటు షాక్కు గురయ్యాయని ,విద్యార్థులు సరైన దారి లేక ఆ నీటి నుండే వెళ్లవలసిన పరిస్థితి దాపురించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార యంత్రాంగం జిల్లా కలెక్టర్ పట్టించుకోకపోవడం సమంజసం కాదని ప్రజాప్రతినిధులు అధికారుల పిల్లలను ఈ కళాశాలలో చదువుపిస్తే అర్థమవుతుందని తెలిపారు. వర్షం పడితే క్లాసు రూములు మొత్తం కూడా నీటిమయమవుతుందని కిటికీలకు తలుపులు లేక కళాశాలకు కాంపౌండ్ వాల్ లేక రాత్రి సమయంలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారిందని పట్టించుకున్న నాధుడే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు కళాశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకొని అధ్యాపకులతో చర్చించి మెట్ పల్లి ఆర్డీవోకి కళాశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారుఈ కార్యక్రమంలో మెట్ పల్లి బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శులు జుంగుల అనిల్ గౌడ్ బత్తుల జగదీశ్వర్ ఐటీ సెల్ కన్వీనర్ పాసు కంటి శ్రీనివాస్ పట్టణ ఉపాధ్యక్షులు లోలపు అనిల్ భోగ దత్తు గుంటుక హనుమాన్లు సంస్కృత విభాగం కన్వీనర్ శ్రీధర్ ఆచారి బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శులు భీమ్నాథ్ విజయ్ శేఖర్ శంభోజి వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ఆర్ట్ గ్యాలరీలో కోరుట్ల ఆర్టిస్టు ద్యావనపెల్లి శంకర్ చిత్రానికి విశిష్ట గుర్తింపు









**హైదరాబాద్, ఆగస్టు3,(నవగీతం):** హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో నిర్వహించిన వారపు సంత కళా ప్రదర్శనలో కోరుట్లకు చెందిన ప్రముఖ ఆర్టిస్టు ద్యావనపెల్లి శంకర్ కాన్వాస్‌పై చిత్రించిన "సంత" అనే కళాఖండం ప్రదర్శనకు ఎంపికైంది."మనసుకి నచ్చిన అందమైన బతుకు చిత్రం" అనే అంశంపై నిర్వహించిన ఈ ప్రదర్శనలో రాష్ట్రంలోని పలువురు కళాకారులు తమ చిత్రాలను ప్రదర్శించగా, మొత్తం 150 మంది ఆర్టిస్టులు పాల్గొన్నారు. వీరిలో 50 మంది కళాకారుల చిత్రాలు మాత్రమే ఎంపికయ్యాయి. అందులో ద్యావనపెల్లి శంకర్ రూపొందించిన "సంత" చిత్రం కూడా చోటు దక్కించుకోవడం విశేషం. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సినీ సంగీత దర్శకుడు బోలె, జబర్దస్త్ ఫేమ్ మణి, ఫైన్ ఆర్ట్స్ ప్రొఫెసర్ మల్లేశం చేతుల మీదుగా ద్యావనపెల్లి శంకర్‌కు జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు.కోరుట్ల పట్టణానికి చెందిన ఆర్టిస్టులు ఎక్కల దేవి శేఖర్, డాక్టర్ భోగ శంకర్, న్యాయవాది చాప కిషోర్ తదితరులు ద్యావనపెల్లి శంకర్‌ను అభినందిస్తూ, ఆయన రూపొందించిన "సంత" చిత్రం ఎంపిక కావడం కోరుట్ల పట్టణానికి గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు అంజి, ఆకొండి కాత్రేని కోనతో పాటు పలువురు కళాకారులు పాల్గొన్నారు.


## అందుబాటులోకి తొలి ప్రైవేట్ ఆయిల్ పామ్



**ఖమ్మం :** తెలంగాణలో తొలి ప్రైవేటు సమీకృత ఆయిల్‌పామ్ పరిశ్రమ ఖమ్మం జిల్లా అంజనాపురంలో ఈ నెల 20న ప్రారంభం కానుంది. గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ రూ.300 కోట్ల పెట్టుబడితో 113.5 ఎకరాల్లో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా 700 మందికి ఉపాధి లభించనుంది. మలేసియా భాగస్వామ్యంతో దేశంలోనే తలమానికంగా నిలిచే సీడ్ గార్డెన్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మరో ఆరు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.తెలంగాణ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటి ప్రైవేటు సమీకృత ఆయిల్‌పామ్ పరిశ్రమ ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. ప్రముఖ గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ సంస్థ ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి రెవెన్యూ పరిధిలోని అంజనాపురం గ్రామపంచాయతీలో ఈ మెగా ప్రాజెక్టును నిర్మించింది. దాదాపు రూ.300 కోట్ల భారీ పెట్టుబడితో 113.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ సమీకృత పరిశ్రమను ఈ నెల 20న ప్రారంభించేందుకు సంస్థ సర్వ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సంస్థ ప్రతినిధులు ఇప్పటికే ఆహ్వానించారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 700 మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.ఈ పరిశ్రమలో ఇప్పటికే నర్సరీ కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతుండగా.. దాదాపు మూడు లక్షల మొక్కలను

## కొడిమ్యాలలో డాగ్ స్క్వాడ్‌తో ఆకస్మిక తనిఖీలు

నిషేధిత మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యం -- ఎస్ఐ ఎ. నరేష్ కుమార్




**కొడిమ్యాల,ఆగస్టు.3.(నవగీతం)** జగిత్యాల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కొడిమ్యాల మండలంలో నిషేధిత మత్తు పదార్థాలు, గంజాయి తదితర నార్కోటిక్ పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కొడిమ్యాల ఎస్సై ఎ. నరేష్ కుమార్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ సహాయంతో మండలంలోని పలు గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని కిరాణా దుకాణాలు, పాన్ షాపులు, వ్యాపార సముదాయాలు, గోదాములు, అనుమానాస్పద నిల్వ కేంద్రాల్లో పోలీసులు ఆకస్మిక సోదాలు చేపట్టారు.శిక్షణ పొందిన ప్రత్యేక స్నిఫర్ డాగ్స్ సహాయంతో ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిషేధిత మత్తు పదార్థాల ఉనికిని గుర్తించే ప్రయత్నం చేశారు.ఈ సందర్భంగా ఎస్సై ఎ. నరేష్ కుమార్ మాట్లాడుతూ, మండలంలో మత్తు పదార్థాలు, గంజాయి లేదా ఇతర అక్రమ నార్కోటిక్ పదార్థాల విక్రయాలు, నిల్వలు, రవాణాను ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. యువత భవిష్యత్తును దెబ్బతీసే మాదకద్రవ్యాల వ్యాపారంపై కఠిన చర్యలు తీసుకుంటామని, డాగ్ స్క్వాడ్‌తో ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని హెచ్చరించారు.శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మత్తు రహిత సమాజ నిర్మాణం కోసం ప్రజలు,వ్యాపారులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా మత్తు పదార్థాల అక్రమ రవాణాపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.పోలీసుల ఈ ఆకస్మిక తనిఖీలను స్థానిక ప్రజలు, వ్యాపారులు స్వాగతిస్తూ పూర్తి సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో కొడిమ్యాల పోలీసు సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ హాస్టల్ నూతన భవనం మంజూరు చేయాలి .

ఎస్ఎఫ్ఐ అఖిల భారత సహాయ కార్యదర్శి ఎం.డి. అతీక్ అహ్మద్.



ములుగు,ఆగస్టు3.(నవగీతం)నూగూరు వెంకటాపురం మండల కేంద్రంలోని బీసీ విద్యార్థుల కోసం నూతన హాస్టల్ భవనాన్ని తక్షణమే మంజూరు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) అఖిల భారత సహాయ కార్యదర్శి ఎండి అతీక్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం సోమవారం వెంకటాపురం మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని పేద, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు సరైన హాస్టల్ వసతి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బీసీ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నూతన హాస్టల్ భవనాన్ని ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని కోరారు.అదేవిధంగా కళాశాల విద్యార్థుల కోసం కళాశాల సమయాలకు అనుగుణంగా ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని, విద్యార్థులందరికీ పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందించాలని, హాస్టళ్లలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, భద్రత వంటి కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జాగటి రవితేజ, రవి, జిల్లా ఉపాధ్యక్షులు కోగిల బాలు, బట్ట స్వామి, రవికుమార్, సంతోష్, జిల్లా కమిటీ సభ్యులు వంశీ, డేవిడ్, సందేశ్, చరణ్, సాక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పాలే పిల్లలకు శ్రేయస్కరం...

జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి,



జగిత్యాల: ఆగస్టు 3,(నవగీతం): ప్రపంచ తల్లి పాల వారోత్సవాల-2026 సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి పాల్గొని తల్లి పాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న తల్లి పాల వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యం ప్రతి శిశువుకు తల్లి పాలే తొలి ఆహారమని, అది ఆరోగ్యకరమైన జీవితానికి పునాది అని తెలియజేయడమేనని అన్నారు.పుట్టిన వెంటనే శిశువుకు తొలి గంటలోనే తల్లి పాలు పట్టించాలని, తొలి ఆరు నెలల పాటు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లి పాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు, రోగనిరోధక శక్తిని పెంచే సహజ గుణాలు ఉంటాయని తెలిపారు. ఆరు నెలల తరువాత తల్లి పాలతో పాటు పౌష్టికాహారం ప్రారంభించి, రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లి పాలను కొనసాగించడం వల్ల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. తల్లి పాలివ్వడం వల్ల శిశువుకు మాత్రమే కాకుండా తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని డాక్టర్ జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. ప్రసవానంతర కోలుకోవడం వేగవంతం కావడంతో పాటు కొన్ని రకాల వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని చెప్పారు. కుటుంబ సభ్యులు, సమాజం కూడా బాలింతలకు పూర్తి సహకారం అందించి తల్లి పాలివ్వడాన్ని ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సూపరెండేంట్ డాక్టర్ కృష్ణమూర్తి,ప్రవీణ,డాక్టర్ నరేంద్ర, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, గర్భిణులు, బాలింతలు పాల్గొని తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన పొందారు. తల్లి పాలివ్వడం ప్రతి శిశువు హక్కు అని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఇది అత్యంత కీలకమని డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
మంగళవారం
4 ఆగస్టు 2026

# ‘ది ప్యారడైజ్’తో నాని కొత్త రికార్డు.. ప్రీ రిలీజ్ బిజినెస్‌లో కెరీర్ బెస్ట్!



నేచురల్ స్టార్ నాని మార్కెట్ రోజురోజుకూ విస్తరిస్తుండగా, ఆయన నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం ‘ది ప్యారడైజ్’ విడుదలకు ముందే ట్రేడ్ వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. థియేట్రికల్ హక్కుల వ్యాపారంలో ఈ సినిమా నాని కెరీర్‌లోనే అత్యధిక ప్రీ రిలీజ్ బిజినెస్ నమోదు చేసిన చిత్రంగా నిలిచే దిశగా దూసుకెళ్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, తెలుగు రాష్ట్రాల్లోనే ఈ చిత్రం థియేట్రికల్ బిజినెస్ రూ.82 కోట్ల నుంచి రూ.84 కోట్ల వరకు చేరినట్లు తెలుస్తోంది. దీంతో నాని మార్కెట్ స్థాయి మరో మెట్టుకు చేరిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.వీశీజఱవం సినిమా నైజాం థియేట్రికల్ హక్కులను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సుమారు రూ.37 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం. ఈ ఒప్పందంలో రికవరీ క్లాజ్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఈ డీల్‌లో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నాగవంశీ, నిర్మాత సుధాకర్ చెరుకూరి భాగస్వాములుగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది. నైజాం ప్రాంతంలోనే ఈ స్థాయి బిజినెస్ జరగడం నాని కెరీర్‌లో అరుదైన మైలురాయిగా భావిస్తున్నారు. కోస్తాంధ్ర హక్కుల కోసం కూడా డిస్ట్రిబ్యూటర్ల మధ్య తీవ్ర పోటీ నెలకొన్నట్లు సమాచారం. అక్కడ కూడా సుమారు రూ.35 కోట్ల స్థాయిలో బిజినెస్ పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అటు రాయలసీమ (సీడెడ్) హక్కుల విషయంలో నిర్మాతలు రూ.12 కోట్ల నాన్-రిఫండబుల్ అడ్వాన్స్ కోరుతున్నట్లు తెలుస్తోంది. పలువురు డిస్ట్రిబ్యూటర్లు ఆసక్తి చూపుతున్నప్పటికీ, తుది ఒప్పందం ఇంకా ఖరారు కాలేదని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. గతంలో నాని నటించిన ‘హిట్ 3’ సినిమా సుమారు రూ.40 కోట్ల ప్రీ రిలీజ్ బిజినెస్‌తో ఆయన కెరీర్‌లో అత్యధిక రికార్డు సృష్టించింది. ఇప్పుడు ‘ది ప్యారడైజ్’ ఆ సంఖ్యను దాదాపు రెట్టింపు చేస్తూ కొత్త బెంచ్‌మార్క్‌ను నమోదు చేస్తున్నట్లు తెలుస్తోంది. ‘దసరా’, ‘సరిపోదా శనివారం’ వంటి వరుస విజయాలతో నాని పాన్ ఇండియా మార్కెట్ మరింత బలపడిందని ఈ బిజినెస్ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ‘ది ప్యారడైజ్’ ను సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. విడుదలకు ఒక రోజు ముందు అంటే సెప్టెంబర్ 23న ఇండియా, ఓవర్సీస్ మార్కెట్లలో ప్రత్యేక ప్రీమియర్ షోలను కూడా నిర్వహించనున్నట్లు సమాచారం.



# వీళ్లకు వయసు పెరుగుతోందా? తగ్గుతోందా?

డైట్, గ్లామర్ మెంటైన్ చేయాలంటే సామాన్యులకు కష్టం గానీ సెలబ్రిటీలకు చాలా సింపుల్. ఎందుకంటే కొందరు 50-60 ఏళ్లొచ్చినా సరే యంగ్‌గా కనిపిస్తూ మెస్మరైజ్ చేస్తుంటారు. ఇప్పుడు సెలబ్రిటీ జంట సూర్య-జ్యోతిక కూడా అలానే షాకిచ్చారు. వీళ్లు కలిసి దిగిన ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గత 30 ఏళ్లుగా నటుడిగా చేస్తున్న సూర్య.. ‘విశ్వనాథ్ అండ్ సన్స్’తో త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. వచ్చే వారం ఈ మూవీ థియేటర్లలోకి రానుంది. దీని ప్రమోషన్లలో ఓ పక్క బిజీగా ఉన్నప్పటికీ మరోవైపు భార్యతో కలిసి ఓ మ్యాగజైన్ కోసం ఫొటోషూట్‌లో పాల్గొన్నాడు. బ్లాక్ అండ్ వైట్, కలర్ గ్రేడింగ్‌తో ఉన్న ఈ ఫొటోల్లో డిజైనర్ దుస్తుల్లో వీళ్లిద్దరూ కనువిందు చేశారు. ఇవి చూసిన చాలామంది వీళ్లకు వయసు తగ్గుతోందా? అని మాట్లాడుకుంటున్నారు. సూర్య సినిమాలతో బిజీగా ఉండగా జ్యోతిక కూడా సెకండ్ ఇన్నింగ్స్‌లో హిందీలో మూవీస్ చేస్తోంది. కొన్నాళ్ల క్రితం ఈమె ‘సిస్టమ్’ అనే వెబ్ సిరీస్ చేసింది. తెలుగులోనూ స్ట్రీమింగ్ అవుతున్న దీనితో సక్సెస్ అందుకుంది.

# ‘అగధ’ ట్రైలర్ విడుదల.. మంత్ర తంత్రాల రహస్యాలతో ఉత్కంఠ రేపుతున్న ఎంఎస్ రాజు!




ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎంఎస్ రాజు మరో విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న మిస్టికల్ థ్రిల్లర్ ‘అగధ’ ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తుండగా, తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ ద్వారా బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు నిర్మిస్తున్నారు. ఆగస్టు 14న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేసింది. అందులో భాగంగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను థ్రిల్లింగ్ ప్రపంచంలోకి తీసుకెళ్తోంది. ట్రైలర్ ప్రారంభం నుంచే మిస్టరీ, ఆధ్యాత్మికత, మంత్ర తంత్రాల నేపథ్యాన్ని ఆసక్తికరంగా పరిచయం చేశారు. “మంత్ర తంత్ర విద్యలకు అందని శక్తి ఉంది... దాని గురించి నాకు తెలియాలి” అంటూ కామాక్షి భాస్కర్ల చెప్పే డైలాగ్ ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమాలో అతీంద్రియ శక్తులు, రహస్యాల చుట్టూ తిరిగే కథ ఉండబోతుందనే సంకేతాలు ఇచ్చారు. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫీ ట్రైలర్‌కు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఉత్కంఠను పెంచేలా ఎంఎస్ రాజు కథనాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. మిస్టరీతో పాటు భావోద్వేగాలు, సస్పెన్స్ అంశాలను సమతూకంగా మేళవించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కామాక్షి భాస్కర్ల తన పాత్రలో ఎంతో ఎమోషన్‌ను ప్రదర్శించగా, శ్రవణ్ రెడ్డి కూడా కథలో కీలకమైన పాత్రలో ఆకట్టుకునేలా కనిపిస్తున్నారు. వీరితో పాటు ఇతర నటీనటులు కూడా కథకు తగ్గట్టుగా తమ పాత్రలకు న్యాయం చేసినట్లు ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. ఎంఎస్ రాజు గతంలో కుటుంబ కథా చిత్రాలు, ప్రేమకథలతో విజయాలు అందుకున్నప్పటికీ, ఈసారి పూర్తిగా భిన్నమైన జానర్‌ను ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది. అతీంద్రియ శక్తులు, మంత్ర తంత్రాలు, పురాతన రహస్యాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందనే నమ్మకంతో చిత్రబృందం ఉంది. ఇప్పటికే ట్రైలర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. విజువల్స్, కాన్సెప్ట్, కామాక్షి భాస్కర్ల నటనపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ‘అగధ’ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాల్సి ఉంది.

# నాని సమర్పణలో నితిన్ కొత్త చిత్రం

## ‘అలియాస్ రుక్మిణీ’ టైటిల్ గ్లింప్స్‌తో ఆసక్తి రేపిన మేకర్స్!



హీరోగా వరుస విజయాలతో దూసుకుపోతూనే, అభిరుచి గల చిత్రాలను నిర్మిస్తూ నిర్మాతగానూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు నేచురల్ స్టార్ నాని. ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. తాజాగా నాని సమర్పణలో హీరో నితిన్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న కొత్త చిత్రానికి ‘అలియాస్ రుక్మిణీ ’ అనే విభిన్నమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ చిత్రబృందం ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రానికి యువ దర్శకుడు మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. కథలో కొత్తదనం, ఆసక్తికరమైన కాన్సెప్ట్ ఉన్నట్లు టైటిల్ గ్లింప్స్ ద్వారా మేకర్స్ హింట్ ఇచ్చారు. ముఖ్యంగా ఈ వీడియోకు నాని అందించిన వాయిస్ ఓవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్లింప్స్ ప్రారంభంలో నితిన్ ఇంజినీరింగ్ పుస్తకాల మధ్య నిద్రపోతూ కనిపిస్తాడు. అయితే అతని ముందు కనిపించే పుస్తకాల పేర్లు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ‘గరం గోపాల్’, ‘ఆమెకు ఆమెంటే ఇష్టం’, ‘వత్రం వెంకన్న’ వంటి వినూత్న శీర్షికలతో ఉన్న పుస్తకాలను చూపిస్తూ వాటి రచయితగా ‘రుక్మిణి’ అనే పేరును ప్రస్తావిస్తారు. దీంతో ఈ రుక్మిణి ఎవరు? అనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరుగుతుంది.ఆ సమయంలో నాని వాయిస్ ఓవర్‌లో రుక్మిణి గురించి వివరిస్తుండగా, చివర్లో నితిన్ “ఆమె నా భార్య” అని చెప్పడం గ్లింప్స్‌కు ఆసక్తికర ముగింపునిచ్చింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమా కథపై మరింత క్యూరియాసిటీ పెరిగింది. ‘అలియాస్ రుక్మిణి’ అనే టైటిల్ వెనుక ఉన్న రహస్యం ఏమిటి? రుక్మిణీ పాత్ర కథలో ఎంత కీలకమనే అంశాలపై చర్చ మొదలైంది. నితిన్ కెరీర్‌లో ఇది మరో విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రం అని తెలుస్తోంది. రొమాన్స్, కామెడీ, ఎమోషన్స్‌తో పాటు ఒక ప్రత్యేకమైన కాన్సెప్ట్‌ను ఈ సినిమాలో మేకర్స్ చూపించబోతున్నట్లు గ్లింప్స్ ద్వారా అర్థమవుతోంది.నాని సమర్పణలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. గతంలో నాని నిర్మాణంలో వచ్చిన పలు చిత్రాలు విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకాదరణ కూడా పొందాయి. దీంతో ‘అలియాస్ రుక్మిణి’ కూడా కంటెంట్ ఆధారిత చిత్రంగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. త్వరలోనే హీరోయిన్, ఇతర నటీనటులు, విడుదల తేదీకి సంబంధించిన పూర్తి వివరాలను చిత్రబృందం ప్రకటించనుంది. టైటిల్ గ్లింప్స్‌తోనే ఆసక్తిని పెంచిన ‘అలియాస్ రుక్మిణి’ ప్రేక్షకులను ఏ స్థాయిలో అలరిస్తుందో చూడాలి.

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001.
Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184.
Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.